


# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :14 సంచిక: 05 హైదరాబాద్ 2014 సెప్టెంబరు పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** వార్షిక సభ్యత్వం : రూ.100/-

**గుర్తుంచుకోవల్సిన రోజు.**

# 2014 అక్టోబరు, 12

హైదరాబాద్‌లోని జూబ్లీ బాబా సెంటర్‌లో 2014 అక్టోబరు 12, ఆదివారం ఉదయం 9.30 నుండి సాయంత్రం వరకూ ప్రత్యేక బాబా సహవాస్ ఏర్పాటు చేసారు. ఉదయం 9.30 నుండి 11.30 వరకూ వారం వారం నిర్వహించే కార్యక్రమాలతో పాటు అవతారుని నామస్మరణలో చిన్నా పెద్దా అన్ని వయస్సుల వారినీ అలరించే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు శ్రీమతి నోరి స్వర్ణ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జంటనగరాలలో వున్న బాబా ప్రేమికులతో పాటు హైదరాబాద్ చుట్టుప్రక్కలనున్న పట్టణాల నుండి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. ఆ రోజు సాయంత్రం ఎప్పటిలా ధుని ప్రజ్వలన కార్యక్రమం వుంటుందని శ్రీ నోరి మెహెర్ చంద్ అన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చేవారికి భోజన, బస ఏర్పాటు సయితం చేశారు. **అక్టోబరు 12, అందమైన ఆదివారాన్ని అవతారుని సమక్షంలో గడపాలనుకోవల్సింది!!**



AVATAR MEHER BABA'S GARDEN OF DIVINITY

# 2014 నవంబరు 9

హైదరాబాద్‌లోని జూబ్లీ బాబా సెంటర్ 28వ వార్షికోత్సవం 2014 నవంబరు 9, ఆదివారం, ఉదయం 7 నుండి సాయంత్రం వరకూ ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్రీ రాజేంద్ర మెహెర్ తెలిపారు. మెహెరాబాద్, అహ్మద్‌నగర్‌ల నుండి మరి ఇతర ప్రాంతాల నుండి బాబా ప్రేమికులు ప్రత్యేకంగా విచ్చేస్తున్నారని ఆయన అన్నారు.

## బాబా సందేశం

**నా సందేశములు మీ నిత్యజీవనంలో ఆచరించకపోయినచో అవి నిరర్థకములే!!**

మెహెర్‌బాబా 1954 మార్చి 2న తూర్పు గోదావరి జిల్లా మండపేట పర్యటనలో ఈ మాటలు చెప్పారని శ్రీ కె. రామకృష్ణమూర్తి ఒక లేఖలో పేర్కొన్నారు.

**- మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. రోడా - ఆదీలు 6-8
3. గుర్తుంచుకోవల్సిన రోజు 9
4. తెలుగు సహవాస్ 10-19
5. లార్డ్ మెహెర్ 20-29
6. మెహెరాబాద్‌లో పసిడి వేడుకలు 30
7. ఉన్నతోన్నతుడు-మెహెర్‌బాబా 31-33
8. బుజావే (గుజరాతి హారతి) 34
9. బుజావే - తెలుగు అనువాదం 35
10. కొత్త పుస్తకం 36
11. మా మాటలు 37
10. ప్రార్థనలు



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

### గుర్తుంచుకోవల్సిన రోజులు

# ఖోజాగూడాలో అక్టోబరు 19

హైదరాబాద్ నగర శివార్లలో గల ఖోజాగూడా కొండ గుహ సమీపంలో, మనోనాశ్ వార్షికోత్సవం సందర్భంగా, 2014 అక్టోబరు 19 ఆదివారం ఉ.10 నుండి మధ్యాహ్నం 12 వరకూ ప్రత్యేక బాబా ప్రేమిక సత్సంగ్ నిర్వహిస్తున్నట్లు శ్రీ రాజేంద్ర మెహెర్ తెలిపారు. ఖోజాగూడ కొండ గుహలో మెహెర్‌బాబా 1951 అక్టోబరు 15 నుండి 24 వరకూ నవజీవనంలో భాగంగా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారన్న సంగతి పాఠకులకు తెలుసు. **అత్యంత ఆధ్యాత్మిక విశేషత** గల ఈ కార్యక్రమానికి బాబా ప్రేమికులందరూ ముఖ్యంగా **హైదరాబాద్‌కు చుట్టుప్రక్కల గల ఇతర పట్టణాల వారందరూ అధిక సంఖ్యలో ఈ అరుదైన సత్సంగ్‌లో పాల్గొనవల్సింది.** ఇంతక్రితం వరకూ వయస్సురీత్యా పెద్దవాళ్ళు మనోనాశ్ గుహ వరకు వెళ్ళేందుకు వీలుగా వుండేది కాదు. ఐతే, ఇటీవల ఇక్కడ చేపట్టిన అనేక అభివృద్ధి పనులు దృష్ట్యా వృద్ధులు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా మనోనాశ్ గుహను చేరుకోవచ్చు. ప్రతి రెండవ శనివారం ఉదయం 8 నుండి 10 దాకా బాబా సత్సంగ్ కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తున్నారు.

**2014 అక్టోబరు 19న కోఠి, మల్కాజిగిరి, దిల్‌షుక్‌నగర్ బాబా సెంటర్‌ల నుండి ఉ. 8 గంటలకు ఖోజాగూడా వెళ్ళేందుకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. మరిన్ని వివరాలకు శ్రీ రాజేంద్ర మెహెర్ (98490-46848) సంప్రదించగలరు.**

# భగవద్వచనం




**ఈ శీర్షిక త్వరలో ప్రారంభించనున్నాం!!**

భగవద్వచనం గ్రంధాన్ని ప్రతి ఒక్కరూ తప్పక చదవమని మెహెర్‌బాబా పలుమార్లు తన ప్రేమికులను ఆదేశించారు. గత అవతారకాలంలో తెలియజేయని అనేక ఆధ్యాత్మిక విషయాలు ఈ గ్రంథంలో వివరించినట్లు మెహెర్‌బాబా పేర్కొన్నారు. ఒరిజినల్ ప్రతి ఇంగ్లీషులో వుంది. మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా, సరళమైన, వ్యావహారిక తెలుగులో అనువాదంలో భగవద్వచనం అందించాలని సంకల్పించాం!! త్వరలో ఈ శీర్షిక ప్రారంభించనున్నాం!!

## సంపాదకీయం శుభం భుయాత్!!

మెహెర్‌బాబా ప్రేమావతారుడు.
ఈ యుగావతారుడు. దయ గల ప్రభువు.
బాబా ప్రవచించిన ప్రేమ, విధేయత, నిస్వార్థసేవ –
ఆచరణలో అమలు అసాధ్యం కాదని రుజువు చేసిన ప్రేమికులు ఎందరో వున్నారు.
అవతారుని సేవకే అంకితమైన భావూజీ గత ఏడాది అక్టోబరు 23న
బాబాలో ఐక్యమయ్యారు. ధన్యజీవి భావూజీ.
2014 అక్టోబరు 23న ఆ మహనీయుడిని కొన్ని క్షణాలు స్మరించుకుందాం!!
అలాగే, గత ఏడాది అక్టోబరు 14న తెలుగు బాబా ప్రేమికుడు
శ్రీ వైయస్ రావు బాబాలో ఐక్యమయ్యారు.
మోహెరాబాద్‌లో చక్కని రెస్టు హౌసు కట్టించి,
తెలుగువారందరికీ ఒక సరైన చిరునామా అందించాడాయన.
నేటితరం–పాతతరం అని రెండుగా విభజించుకుంటే,
శ్రీ వై.యస్. రావ్ ముందు తరం కోవకే చెందుతాడు.
ఈ తరం యువత ఉత్సాహంగా వున్నారు.
బాబాప్రేమిక పరివారంలో నివురుగప్పిన నిప్పులా యువత వున్నారు.
వారిని ప్రోత్సహించాలి.
బాబా నామవ్యాప్తికి వారికి తగిన అవకాశం ఇవ్వాలి.
నేటి పెద్దలు వెనుక వుండి దర్శకత్వం వహించాలి.
దీనికి నాందీ ప్రస్తావన హైదరాబాద్ కోఠి బాబా సెంటర్,
జూబ్లీ సెంటర్‌లలో జరిగిందని చెప్పొచ్చు.
ఇందుకు నోరి సోదరులు, రాజేంద్ర మెహెర్ ప్రభృతులు అభినందనీయులు.
తెలుగునాట గల ఇతర బాబా కేంద్రాలలో ఈ ప్రయత్నం ఆరంభం కావాలి.
ఈ తరం యువత బాబా సేవా కార్యక్రమాలలోనే కాదు,
సోషల్ మీడియాలోనూ చురుకుగా వున్నారు.
ఎటొచ్చీ ప్రింట్ మీడియా, ముఖ్యంగా తెలుగు పత్రికలపై
వారు దృష్టి చూపాలి.
గతం భవిష్యత్తుకి మార్గం అయితే,
నవతరానికి **ఈ తరం** మార్గగాములు కావాలె!!
శుభం భుయాత్!!

# రోడా - ఆదీలు



ఇది యదార్థ సంఘటన.
కరాచీ పట్టణంలో
జరిగిందీ సంఘటన..
ఇక చదవండి.
వారిది ఒక పార్శీ
పండిత కుటుంబం.
జోరాష్ట్రియన్ మతస్థులు.
వారి కుమార్తె పేరు రోడా.
ఆమె అవతార్ మెహెర్‌బాబా
గురించి తన స్నేహితుల
ద్వారా విన్నది.
అయితే ఆమె కుటుంబానికి మెహెర్‌బాబా అంటే అస్సలు గిట్టదు.
మెహెర్‌బాబా అంటే ఒక మోసగాడని వారి భావం.
అందుకూ ఒక కారణం వుంది.
అదేమంటే, వాళ్ళ ఇంటిప్రక్క ఒక బాబా ప్రేమిక కుటుంబం వుండేది.
వారు బాబాను ఎంతగానో ఆరాధించేవారు.
ఆ ఇంట్లో వారమ్మాయి ఆకస్మాత్తుగా ఒక విచిత్ర వ్యాధికిలోనై ఎంతో బాధపడి మరణించింది. స్థానిక పార్శీవారందరూ తమ ప్రభువైన జోరాష్ట్రను విస్మరించి, మెహెర్‌బాబాను అనుసరించినందువల్లనే వారికి ఈ మరణం సంభవించిందని వారందరూ గట్టిగా నమ్మారు.
రోడా పెరిగి పెద్దదయ్యింది.
ఆమెకు **ఆదీ దుబాష్** అనే యువకునితో వివాహం నిశ్చయించారు.
ఒకరోజున ఆదీ దుబాష్ తన స్నేహితుడైన మినూ ఖరాస్‌తో
మెహెర్‌బాబా గురించి మాట్లాడుతుండటం రోడా విన్నది.
మినూఖరాస్ మెహెర్‌బాబాకు గొప్ప ప్రేమికుడు.
అతడు మెహెర్‌బాబా కొలువులో కృష్ణదేవరాయలవారి ఆస్థానంలో
రామకృష్ణుడి వంటివాడు.
**దాంతో ఆదీ** కూడా మెహెర్‌బాబా ప్రేమికుడని అర్థమయింది.
రోడా ఆలోచనల్లో పడింది. తన కుటుంబానికి బాబా అంటే గిట్టదు.

అలాంటిది తన తల్లితండ్రులు ఆదీ దుబాష్‌ని అంగీకరిస్తారా?
అతనితో తన పెళ్ళి విషయంలో వారు సమస్యలు సృష్టిస్తారేమోనని రోడా భయపడింది.
మెహెర్‌బాబా ఎడల సంపూర్ణ విధేయత, విశ్వాసం తనకున్నాయన్నాడు ఆదీ.
ఈ సమయంలో ఈ సమస్యకు పరిష్కారం ఎలాగో రోడాకు పాలుపోలేదు.
ఆమె ఆదీని అమితంగా ప్రేమించింది.
ఇదొక గొప్ప పరీక్షా సమయం అనుకుంది. ఫలితం భగవంతునిపై వుంచింది.
అలా ఆలోచనలో వుండగా తన చిన్ననాటి కోరిక గుర్తుకొచ్చింది.
భగవంతుడు తమ వివాహాన్ని వర్షంతో ఆశీర్వదించాలనుకుంది.
కరాచీలో ఎండలు ఎక్కువ. సంవత్సరంలో చాలా తక్కువ వానలు కురుస్తాయి.
ఒకవేళ వాన పడినా, కొద్దిపాటి జల్లు మాత్రమే పడుతుంది.
రోడ్లు జలమయమయ్యేటంత వానలు కరాచీలో ఎన్నడోకాని కురవవు.
ఆమె బాబాకు ఒక సవాలుగా మనస్సులోనే ఇలా అనుకుంది.
ఏమని?
**'మెహెర్‌బాబా నిజంగా భగవంతుడైతే, తన పెళ్ళి రోజున బాబా పెద్ద వర్షం కురిపించాలి"**
అని అనుకుంది. ఆ దరిమలా ఆ సవాలును మర్చిపోయింది.
వివాహ శుభఘడియలు రానేవచ్చాయి. ఆ రోజు ఎండ ఎక్కువగానే ఉంది.
ఆకాశం నిర్మలంగా వుంది. ఆ సంతోష ఘడియలలో రోడాకు తన సవాలు
గుర్తే లేదు. సాయంత్రం వివాహ వేడుకకు అంతా సిద్ధమైంది.
వేదికను కడు శోభాయమానంగా అలంకరించారు.
హఠాత్తుగా ఆకాశం మేఘావృతమైంది. కారుచీకట్లు కమ్ముకొచ్చాయి.
చిన్న వర్షంగా ప్రారంభమై కుంభవృష్టిగా వర్షం కురిసింది.
కరాచీ నగర చరిత్రలోనే అంతటి వర్షం ఎన్నడూ ఎవరూ ఎరగరు.
జనమంతా తడిసిపోయారు. పట్టణ వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి.
ఎక్కడి కార్లు అక్కడ ఆగిపోయాయి. పెళ్ళి చేయించాల్సిన పురోహితుడు కూడా
ఆ వానలో చిక్కుకుపోయాడు.
ఆహ్వానితులు చాల కొద్దిమంది మాత్రమే వివాహానికి రాగలిగారు.
ఆదీ దుబాష్, రోడా ఇద్దరూ తడిసిన బట్టలతోనే వివాహ తంతు పూర్తిచేశారు.
క్రమంగా రోడా కూడా బాబా పరిధిలోకి వచ్చింది.
బాబా పాదసన్నిధికి ప్రేమతో చేరింది. బాబా ప్రేమకు పాత్రురాలయింది.
రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి.
1964లో అహ్మద్‌నగర్‌లో బాబా ప్రేమికుడైన సరోష్ ఇరానీ గారి కుమారుడి
పెళ్ళి జరుగుతున్నది. పెళ్ళికి ముందురోజున సరోష్ కుటుంబాన్నంతటినీ

మెహెరాజాద్‌కు రమ్మనమని బాబా ఆహ్వానించారు.
బాబా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆ మర్నాడే పెళ్ళి.
ఆ పెళ్ళి రోజున కుండపోతగా వర్షం కురిసింది. ఆ పిదప ఒకరోజున సరోష్ బాబా దగ్గరకు మెహెరాజాద్‌కు వెళ్ళాడు. మాటల మధ్యలో తన కుమారుడి పెళ్ళి రోజున కురిసిన వాన గురించి ప్రస్తావన వచ్చింది.
అలా వాన కురవడం...బాబావారి ఆశీర్వచనమా?"
అని సరోష్ బాబాని అడిగాడు.
ఓ!! వాన కురవడమా!! అదేదో రోడాను అడుగు అన్నారు బాబా.
రోడా అవాక్కయ్యింది.
ఒక్కసారిగా సినిమా రీలులాగా తన పెళ్ళి రోజున కురిసిన వాన,
తాను బాబాకు వేసిన సవాలు ఒక్క క్షణంలో గుర్తుకు వచ్చి తలదించుకుంది.
తాను మరచి పోయినా, బాబా మరిచిపోలేదు సుమీ అనుకుంది.
ఆ తర్వాత రోడా గర్భవతి అయింది.
నెలలు నిండిన తర్వాత డాక్టర్లు పరీక్షించి కాన్పు కష్టమవుతుందన్నారు.
ప్రసవంలో తల్లి క్షేమంగా బయటపడ్డా, బిడ్డ బ్రతకడం కష్టమని డాక్టర్లు తేల్చిచెప్పారు.
రోడా రోదిస్తూ బిడ్డ క్షేమంగా వుండాలని బాబాను మనసారా ప్రార్థించింది.
తన బిడ్డను బాబాకు అంకితమిస్తానని మనస్సులోనే ఆమె శపథం చేసుకుంది.
నెలలు నిండిన రోడాకు పండంటి బాబు పుట్టాడు.
బాబా ఆ పిల్లవానికి మేర్వాన్ అని పేరు పెట్టమని కబురు పంపారు.
అవతారునికి సంపూర్ణంగా అంకితమైన రోడా ఆదీలు,
మేర్వాన్‌ను రోజుల పిల్లవానిగా వుండగానే మెహెర్‌బాబాకి అప్పగించారు.
ఆ దరిమలా బాబా అతడిని లండన్‌లో చదివించారు.
భావూజీ బాబాలో ఐక్యమయ్యాక, ఇటీవల ట్రస్టు సభ్యునిగా
మేర్వాన్ 2014 మార్చి 29న ఎంపికయ్యాడు.
ట్రస్టు వారి ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షిస్తున్నాడు మేర్వాన్.
కెనడా, లండన్ మహానగరాలలో అనేక దశాబ్దాలపాటు చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేసిన అనుభవం ఆయనకి వుంది.
ఆతని భార్య రూబీ,
మెహెరాబాద్‌లో ఏర్పాటు చేసిన బాబా వారి ఆర్కైవ్స్ ఇంచార్జిగా వుంది.
అవతారుని లీలలు అనంతం.
అవగతం కావవి.
అనుభవించాల్సిందే!!

# గుర్తుంచుకోవల్సిన రోజులు

# Discovering the Avataric Treasure

## మెహెరాబాద్‌లో ఒక ప్రత్యేక రెండ్రోజుల సహవాస్

## 2015 ఫిబ్రవరి 13, 14 తేదీలలో

2015 ఫిబ్రవరి 13, 14 తేదీలలో మెహెరాబాద్‌లో ఒక ప్రత్యేక రెండ్రోజుల సహవాస్ ఏర్పాటు చేసినట్లు చైర్మన్, మెహెర్‌బాబా ట్రస్టు, శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సహవాస్ **Discovering the Avataric Treasure** అనే అంశంపై ఏర్పాటు చేశామన్నారు. ఈ అవతారకాలంలో అవతార్ మెహెర్‌బాబా 1921 నుండి 1925 జూలై మధ్యకాలంలో బాబా తన శిష్యుల ఎంపిక, వారికి శిక్షణ, మండలి సభ్యుల ఏర్పాటు వంటి అతి ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమయంలో జరిగిన అనేక ముఖ్యమైన చారిత్రక సంఘటనలపై చర్చా గోష్ఠులు, లఘు చిత్రాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు.

**సహవాస్‌లో చర్చించే ముఖ్యాంశాలు:**

1. పూణేలోని ఫెర్గూసన్ కాలేజీ రోడ్‌లో మెహెర్‌బాబా ఏర్పాటుచేసిన ఆశ్రమం,
2. కాలి నడకన పూణే నుండి మంజిల్-ఇ-మీమ్, బొంబాయికి ప్రయాణం,
3. మంజిల్-ఇ-మీమ్, బొంబాయిలో ఆనాటి బాబా నెరపిన కార్యక్రమాలు,
4. మెహెర్‌బాబా-హజరత్ బాబాజాన్‌ల నడుమ జరిగిన సంభాషణ
5. మంజిల్-ఇ-మీమ్‌లో మండలివారికి బాబా ఇచ్చిన శిక్షణ
6. ఉపాసనీ మహారాజ్ జీవిత చరిత్ర ముద్రణ
7. మెహెర్‌బాబా మండలివారితో కలిసి ఆజ్మీర్ పర్యటన
8. మెహెరాబాద్‌కు బాబా ప్రప్రథమ పర్యటన
9. 1925 జూలై 10 కంటే ముందు మెహెరాబాద్ కాలనీ ఏర్పాటు. తదితరములు.

ఈ మాదిరిగా గత నాలుగు సంవత్సరాలుగా ప్రత్యేక సహవాస్ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చర్చా వేదికలో పాల్గొన గోరువారు

Gokaram Shrivastava, Library Committee Meherabad, Meherabad Hill Library అడ్రస్సుకు ముందుగా లేఖ ద్వారా కానీ, లేదా Ph: 0241-2458473,• **email:** hill.library@ambppct.org, gokaranshrivastava@gmail.com, తెలియచేయవల్సిందిగా కోరుతున్నారు.

భోజన, వసతి కోరువారు P. Dastoor, Coorrdinator, Library Committee Meherabad, email: jaibaba@ambppct.org, Ph: 0241-2548777.

# తెలుగు సహవాస్



ఈ భవబంధనాల నుంచి శాశ్వత విముక్తి పొందాలంటే మూడు
పరిష్కార మార్గాలు వున్నాయన్నారు బాబా.
నా పాదాల దగ్గర ధూళిగా మారాలి.
ఇది అసాధ్యం.
రెండవ సూచనగా..
ఈ సమాజంలో ప్రతి పనీ చేస్తూ,
అంటే సంసారం, కుటుంబం, ఇల్లు, పిల్లా పాపలు, వ్యాపారం,
ఇత్యాది పనులకు హాజరవుతూనే,
రోజుకి 14సార్లు బాబా నామం జపించమన్నారు.
బాబా నామం 14సార్లకు ఎక్కువ కాకూడదు,
అలాగే తక్కువ కాకూడదన్నారు.
తద్వారా బాబాలో ఐక్యం సాధ్యమౌతుందన్నారు.
రోజుకు 14సార్లు బాబా నామం తలుచుకోవడం కష్టమనుకుంటే,
కనీసం మీ తుదిశ్వాస సమయంలో,
మీ ప్రాణాలు వదిలే ముందు, మీరు నా నామం తలచుకుంటే
మీరు నాలో తప్పక ఐక్యమౌతారని బాబా అన్నారు.

ఇదేమీ చిన్న విషయం కాదు.
ఇప్పటి నుండి ప్రతిక్షణం నా నామం తలచుకోవడాన్ని మీరు అలవరచుకుంటేనే
మీ ఆఖరి క్షణాల్లో నా నామం గుర్తుకు వస్తుందని హెచ్చరించారు.
ఇదీ కష్టమని మీరు భావిస్తే, ఇదీ మీరు చేయలేని పక్షంలో
ఆఖరి ప్రయత్నంగా నిస్వార్ధ సేవ చేయడం అలవరచుకోమన్నారు.
నేను ప్రతి ఒక్కరిలో, ప్రతి దానిలోనూ వున్నాను కనుక
ఇతరులకు నిస్వార్ధ సేవలు అందించమన్నారు.
సేవే పరమార్ధం కావాలన్నారు.
తద్వారా మానవ జీవిత లక్ష్యమైన మోక్షం తప్పక లభిస్తుందని బాబా హామీ ఇచ్చారు.
ఇందుకు ఉదాహరణగా చెబుతూ
ఇటీవల గాడ్గే మహారాజ్, ఆయన అనుచరులైన కైకాడి మహారాజ్,
నామానంద్‌లు నా నామం, నా ప్రేమ సందేశ వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్నారు.
మానవాళి ఉన్నతి కోసం వారు పలు ప్రదేశాలు పర్యటిస్తున్నారు.
ధర్మశాలలు, పాఠశాలలు, ఆసుపత్రుల నిర్మాణం చేపట్టారు.
భగవన్నామ వ్యాప్తి కోసం వారు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు.
వారు బాబాను ఎంతగానో ప్రేమిస్తున్నారు.
గాడ్గే మహారాజ్ ఇటీవల నన్ను పండరీపూర్ తీసుకువెళ్ళారు.
వేలాదిమంది నన్నక్కడ దర్శించుకున్నారు.
ఆ ప్రాంతంలో గాడ్గే మహారాజ్‌నే ఒక గొప్ప సాధువుగా ఆరాధిస్తారు.
బాబా ఈ సందర్భంలో వినోభా భావేను మరో ఉదాహరణగా పేర్కొంటూ
మానవాళి ఉన్నతి కోసం కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా ప్రయాణిస్తూ
వినోభాజీ మానవాళి కోసం విశేష సేవలు అందిస్తున్నాడన్నారు.
భారతదేశంలో ఇలాంటి నిస్వార్ధ సేవలందిస్తున్న సత్పురుషులకు కొదవలేదన్నారు.
మీలో కూడా మీకు తెలియకుండానే అనేక మంచి పనులు చేస్తున్నవారు
చాలామంది ఉన్నారన్నారు.
ఏమాత్రం అహంభావం లేకుండా
**'నేను'** అనే ఆలోచన లేకుండా చేసే సేవే
నిస్వార్ధ సేవ అవుతుందన్నారు బాబా.
ఈ కార్యక్రమంలో ఏమాత్రం అహంభావం ప్రదర్శించినా
చేసే ప్రయత్నమంతా వృధా ప్రయాసవుతుందన్నారు.
కొన్ని వేలమందిలో ఏ ఒక్కరో నిజమైన నిస్వార్ధ సేవలను
మానవాళికి అందిచగల్గుతారన్నారు.

సాధు సత్పురుషులు కూడా ఈ విషయంలో
అపజయం పాలయ్యే అవకాశం ఉందన్నారు.
విదేశాలలో కూడా మానవాళికి నిస్వార్ధ సేవలందించేవారు ఎందరో వున్నారు.
కుష్ఠువారికి నిస్వార్థంగా సేవలందించే డాక్టరు ఒక్కరు అమెరికాలో ఉన్నారు.
ఆయన అహర్నిశం కుష్ఠువారికి సేవ చేయడంలోనే నిమగ్నమై ఉంటాడు.
తన బాగోగులు గురించి ఆయన ఏమాత్రం పట్టించుకోడు.
అతనికి మెహెర్‌బాబా అంటే ఎవరో తెలియదు.
అలాంటివారు ఎంత నిస్వార్ధ సేవ చేసినా వారు నా పరిధిలోకి రాకుండానే వుంటారు.
ఎందుకు అంటే, మనస్సు ప్రధానకారణం అవుతుంది.
అతిచిన్న ఆలోచనలు కూడా అనేక సంస్కార బంధనాలలో చిక్కుకునేలా చేస్తుంది.
అందువల్ల వారు బాబాను తెలుసుకోలేరు అని అన్నారు.
అయినప్పటికీ అలాంటి వ్యక్తులు వారి దేహం వదిలేసిన తర్వాత
వారు నా దరిచేరగల్గుతారన్నారు.
ఎలాగంటే వారి మనస్సు, ఆలోచనలు వారి కోసం కాకుండా
వారు చేపట్టిన పనిపై మాత్రమే కేంద్రీకృతమై ఉంటుంది కాబట్టి
వారికి బ్రహ్మైక్యం తప్పక లభిస్తుంది.
అనంతరం సహవాసీలనందరినీ ఒక అరగంట బయటకు వెళ్ళి విశ్రాంతి తీసుకుని
తిరిగి సమావేశ మందిరానికి రమ్మనమన్నారు.
ఇకపై రేపటి నుండి ఇలాంటి వివరణలు,
తన సందేశాలు ఏమీ ఉండవన్నారు.
మనందరం కలిసి మెలసి ఆడుతూ పాడుతూ సరదాగా గడుపుదామన్నారు.
భగవంతుడు కరుణామయుడు.
భగవంతుడు ప్రేమ సముద్రుడు.
ఈ విషయం ఎల్లవేళలా గుర్తుంచుకోమన్నారు.
భగవంతుడు ఎంతటి కరుణామయుడైనా,
ప్రేమ స్వరూపుడైనా ఒక్కటి మాత్రం ఎన్నటికీ సహించడన్నారు.
అదేమంటే కపట ప్రవర్తనను భగవంతుడు ఎన్నటికీ సహించడన్నారు.
ఒక దుర్మార్గుడు తానేదో గొప్ప సాధు సత్పురుషుడిగా బయటకి కనబడేందుకు ప్రయత్నిస్తే,
అలాంటివారిని భగవంతుడు ఎన్నటికీ క్షమించడని బాబా స్పష్టం చేశారు.
30 నిముషాలు విశ్రాంతి తర్వాత సమావేశ హాలులో తిరిగి అందరూ హాజరయ్యారు.
వారినుద్దేశించి బాబా మాట్లాడుతూ,
**"గాడ్‌స్పీక్స్" - భగవద్వచనం** గ్రంథం చాలా ప్రత్యేకమైందన్నారు.

గత అవతార కాలాలలో ఎన్నడూ చెప్పని అనేక ఆధ్యాత్మిక సూక్ష్మాలను
ఈ గ్రంధంలో ఉటంకించానన్నారు.
ఈ గ్రంథం చదివితే మీరేమిటో మీరెక్కడున్నారో మీకు అర్థమౌతుందన్నారు.
భగవద్వచనం చదివిన తర్వాత మీకంతా అర్థమయ్యిందని
మీరే భగవంతుడనని ప్రకటించవద్దన్నారు.
మీకా అనుభూతి అనుభవం ద్వారా మాత్రమే అర్థమౌతుందన్నారు.
మీరు నన్ను భగవంతుడిని అని నమ్మితే ఆ మాటే బహిరంగంగా చెప్పండి.
లేనిపక్షంలో మీ మనస్సులోని మాటనే చెప్పండి.
లోపల ఒకటి, బయట మరొకటి మాత్రం వద్దన్నారు.
మీ రాకకంటే ముందు గుజరాతీ సహవాస్ వారం రోజులపాటు జరిగింది.
వారికి చెప్పిన కొన్ని మాటల్ని మండలి సభ్యుడు రమ్జూ అబ్దుల్లా నోట్స్ రాసుకున్నాడు.
ఆ నోట్స్‌ను రేపటి రోజున మీకు చదివి వినిపిస్తారన్నారు.
ఇదేమాదిరిగా మీ తర్వాత వచ్చే మరో రెండు గ్రూపులకు కూడా
అవే అంశాలను చదివి వినిపిస్తారన్నారు.
నా ప్రేమ సందేశ వ్యాప్తికి మీరు చేస్తున్న కృషి నాకు తృప్తిగా లేదన్నారు.
నా ఇచ్ఛ ప్రకారం మీరు ఆ పనిని చేయడంలేదని బాబా నిర్ద్వందంగా ప్రకటించారు.
నేను ఇదే విషయాన్ని గుజరాతీ సహవాసీలతో కూడా చెప్పాను.
అలాగే రాబోయే రెండు గ్రూపులవారికీ చెప్తాను.
నా కార్యకర్తలలో అభిప్రాయ బేధాలు ఉన్నాయి.
అవి సమూలంగా ఇక్కడే పరిష్కరించాలి.
సహవాసీలలో కొందరు బాబాను తమ ఆంధ్రా ప్రాంతంలో దర్శించుకున్నామన్నారు.
ఆ దరిమలా, అనేక మహత్యాలు తాము చవి చూశామన్నారు.
ఇందుకు బాబా సమాధానమిస్తూ ఈ రోజు దాకా తానెలాంటి మహత్యం
ఒక్కటి కూడా చేయలేదన్నారు.
మీరు చూస్తున్న **ఈ సృష్టే నా చమత్కారం కాదా** అని ప్రశ్నించారు.
ఇంతకన్నా పెద్ద మహత్యం ఏం కావాలన్నారు.
మీ ప్రాంతాలలో నేను కన్పించడం లేదా చనిపోయిన వ్యక్తి లేచి రావడం
ఇవన్నీ నాకేమీ తెలియదన్నారు.
నేనెన్నడూ అలాంటి మహత్యాలు చేయలేదన్నారు.
ఇటీవల నిజంగా జరిగిన ఒక సంఘటనను చెప్తూ బాబా ఇలా చెప్పారు.
గత రెండు నెలలుగా నా దృష్టికి రెండు సంగతులు తెలిశాయన్నారు.
ఒకటి ఉత్తరప్రదేశ్‌కు సంబంధించినది.

అక్కడ ఒక చనిపోయిందనుకున్న ఒక చిన్న పిల్ల తిరిగి ప్రాణం పోసుకుందని నాకు చెప్పారన్నారు.

నేను సతారాలో జూలై నెలలో ఉండగా సాధు రామ్‌దాస్ అనే వ్యక్తి నా దర్శనార్థం వచ్చాడు.

అతని గురువు గారి ఆదేశాల మేరకు అతను నా దర్శనార్థం వచ్చాడు.

ఆ సమయంలో నేను ఏకాంతవాసంలో ఉన్నందు వల్ల అతను నన్ను నేరుగా చూడకుండా ఒక కిటికీ ద్వారా చూసేందుకు అనుమతించాను.

ఆ తర్వాత అతను ఇక్కడి నుండి నాసిక్ వెళ్ళాల్సి వుంది.

కానీ, అతను నాసిక్ వెళ్ళలేదని ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ ప్రేమికుడైన కేశవనారాయణ్ నిగం నాకు తెలియజేశాడు.

సాధు రామ్‌దాస్‌కు నన్ను కిటికీలోంచి చూసినప్పుడు అతనికి రాముడు, కృష్ణుడు, శివుని రూపాలలో నా దర్శనమయ్యిందని సాధు రామ్‌దాస్ చెప్పాడన్నారు.

అయితే అతనికి నేను ఆ మూడు రూపాలలో కనిపించి వుండవచ్చేమో కానీ, ఈ మహత్యం గురించి నాకేమీ తెలియదన్నారు బాబా.

అలాగే ఈ అంశానికి ఎలాంటి ఆధ్యాత్మిక ప్రాధాన్యత లేదని బాబా అన్నారు.

ఆ దరిమిలా రామ్‌దాసు నా నామ వ్యాప్తికి పూనుకున్నాడు.

తొలుతగా 40 రోజులపాటు ఉపవాసం ఉన్నాడు.

ఆ తర్వాత ఒక మారుమూల గ్రామంలో భగవంతుని గురించి చెప్పేందుకు వెళ్ళాడు.

ఆ ఊరి వారికి మెహెర్‌బాబా గురించి చెప్పి వారి చేత బాబా భగవంతుడు అని నమ్మించడం అంత సులువైన విషయం కాదని కేశవ నారాయణ్‌కి తన లేఖలో చెప్పాడు.

కష్టాలలో అందరూ భగవంతుడిని స్మరిస్తారు.

కానీ సంతోషంగా ఉన్నప్పుడు దేవుని స్మరించడం మంచిదని నా అభిప్రాయం.

సాధు రామదాసు ఆ గ్రామ సర్పంచ్‌ని ఒప్పించి పెద్ద భజన కార్యక్రమం చేపట్టాడు.

చాలా కొద్దిమంది గ్రామస్తులే ఆ భజనకు వచ్చారు.

ఈ భజన ప్రారంభమైన కొద్ది క్షణాలకే గ్రామంలో ఒక చిన్నపిల్ల చనిపోయింది.

ఆ పిల్ల తల్లితండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున అరుపులు కేకలు, ఏడుపులు మొదలెట్టారు.

సాధు రామదాసు భజన కార్యక్రమాన్ని మధ్యలోనే ఆపివేశాడు.

అంతేకాకుండా అక్కడి చేరినవారందరినీ బాబా నామం, బాబా ప్రేమ, బాబావారి సందేశాలను శ్రద్ధగా ఆలకించమని చెప్పాడు.

ఆ చనిపోయిన చంటిపిల్ల తండ్రిని ఆ పిల్లను తీసుకొచ్చి తన ఒడిలో వుంచమన్నాడు.
ఆ పిల్లను అలా తన ఒడిలో వుంచుకుని భజన చేశాడని,
అ కొద్ది క్షణాల తర్వాత చనిపోయిందనుకున్న పిల్ల తిరిగి శ్వాస తీసుకుని
కెవ్వున ఏడుపు ప్రారంభించడంతో అందరూ సంతోషంతో కేరింతలు కొట్టారని
నిగం తెలియజేశాడు.
ఈ విషయం చుట్టుప్రక్కల గ్రామాలవారికి కూడా తెలిసి
ఈ చమత్కారాన్ని చూడ్డానికి ఆ గ్రామానికి రావడం ప్రారంభించారని
కేశవ్ నారాయణ్ నిగం తన లేఖలో రాశాడు.
ఈ విషయం నాకు తెలిసి నేనే ఆశ్చర్యపడ్డాను.
నేనేమీ ఎలాంటి మహత్యం చేయలేదు.
సహవాసీలందరూ గట్టిగా నవ్వుకున్నారు.
బహుశా సాధు రామదాసుకు నా యందు వున్న ప్రేమ వల్ల
ఆ చిన్నారి బ్రతికి వుండవచ్చు.
గ్రామస్తులు ఆశ్చర్యంతో నా నామం స్మరించినా
అది వారికి నాపై నమ్మకం కంటే ఆ చమత్కారం మీదనే మమకారం
ఎక్కువని చెప్పాలి.
నేను ఒకే ఒక మహత్యం చేస్తాను.
అదేమంటే మీలో వున్న భగవంతుడ్ని దర్శించుకునేలాగా
చేయడమే నా మహత్యం అన్నారు.
మరో చమత్కారం గురించి బాబా ఇలా ప్రస్తావించారు.
నౌరోజీ దాదాఛాన్జీని, (ముంబాయి) మీలో చాలామంది చూసేవుంటారు.
చాలాకాలంగా అతను నాకు సన్నిహితంగా వున్నాడు.
అతను నన్ను ఎంతగానో ప్రేమిస్తాడు.
నౌరోజీ భార్య నా నామం తలచుకుంటూనే మరణించింది.
అతని కొడుకు కూడా అలాగే మరణించాడు.
అయినా కూడా నౌరోజీకి నా ఎడల గల ప్రేమలో ఎలాంటి మార్పు రాలేదు.
ఆఖరి క్షణాలలో నా నామం తలచుకుంటూ తుదిశ్వాస విడిచేవారు
చాలా కొద్దిమందే వుంటారు.
ఈ సంఘటనలు జరిగాక నౌరోజీ ఒకరోజున మెహెరాజాద్‌కి వచ్చాడు.
నేను అతనిని కౌగిలించుకుని ఓదార్చాను.
ఇటీవలనే అతని చిన్న కుమారుడు నౌజార్ విమాన ప్రమాదంలో చనిపోయాడు.
అతను చాలా చిన్న వయస్సువాడు.

కుటుంబానికి ఆర్థికంగా అండదండలు అందించేవాడు.
మెహెరాజాద్‌కు కూడా అతను ప్రతి నెలా తన జీతంలో నుండి కొంత మొత్తాన్ని నా కోసం సహాయంగా పంపుతున్నాడు.
అతను విమాన ప్రమాదంలో చనిపోయె ముందు
నేను సతారాలో వుండగా అతను నా దర్శనార్థం వచ్చాడు.
అతను విమానం ఎక్కేముందు నా నామం తలచుకోమని చెప్పాను.
ఇటీవల నౌరోజీ అతని మరణవార్త తెలియజేస్తూ నాకు టెలిగ్రామ్ పంపాడు.
ఉత్తరప్రదేశ్‌లో చనిపోయిన చిన్నపిల్ల తల్లితండ్రులు నన్ను చూడలేదు.
నా గురించి తెలియదు.
వారికి నామీద ఎలాంటి ప్రేమా లేదు.
అలాంటిది ఆ చంటిపిల్ల తిరిగి ప్రాణం పోసుకుంది.
ఇక్కడ ఇద్దరు కుర్రవాళ్ళు ఒకే కుటుంబానికి చెందినవారు
నా పట్ల అమితమైన ప్రేమాభిమానాలు కలిగినవారు ఆకస్మికంగా
అర్థాయుషుతో కన్నుమూశారు.
అయినప్పటికీ నౌరోజీకి నా పట్ల అతని ప్రేమలో
ఎలాంటి మార్పు లేదు.
అదే నిజమైన ప్రేమ.
నిజానికి జననం లేదు, మరణమూ లేదు.
అది నాకు తెలుసు.
అనాదిగా మనందరం ఉన్నాం.
నన్ను ఎలాంటి మహత్యాలతో ముడిపెట్టొద్దు.
అలాగే నేనెన్నడూ ఎలాంటి మహత్యాలు చేయను.
చనిపోయినవారిని బ్రతికించను.
అయితే మీరు కోరుకునేవి పోగొట్టుకుని,
మీరు నాపట్ల ప్రేమ విధేయతతో కొనసాగుతుంటే
అది మాత్రం నాయొక్క నిజమైన మహత్యంగా మీరు భావించమన్నారు.
ఇదంతా వింటూ నీవేమీ చింతించొద్దని కట్టా సుబ్బారావు, (ఏలూరు)ని ఉద్దేశించి బాబా చమత్కరించారు.
నిజాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఈ మాదిరిగా చెప్పడం నా అలవాటు.
ఇదే నా విధానం.
నేను ఏలూరుకి వచ్చినప్పుడు నాకోసం నీవు అనేక ఏర్పాట్లు చేశావు.
నేనెంతో సంతోషించాను.

నీకేమీ ఎలాంటి కష్టం రాదులే. నీవేమీ చింతించొద్దు అని
బాబా కట్టా సుబ్బారావుతో మళ్ళీ అన్నారు.
మా అన్నగారు జమ్‌షెడ్ నన్నెంతగానో ప్రేమిస్తాడు.
ఇది అందరికీ తెలుసు.
అతను నా పేరు స్మరిస్తూ తుదిశ్వాస వదిలాడు.
ఈ విషయం నాకు టెలిగ్రామ్ ద్వారా తెలిసింది.
ఆ సమయంలో నేను ప్రేమాశ్రమం స్కూల్ పిల్లలతో క్రికెట్ ఆడుతున్నాను.
జంషెడ్ నాలో ఐక్యమయ్యాడని చెప్పి పిల్లలందరికీ ఆ రోజు మిఠాయి పంచిపెట్టాను.
ఇది 1926లో జరిగింది.
తెలుగువారికి ఈ రోజు చాలా శుభదినం.
ప్రతినెలా 12వ తేదీన మెహెరాబాద్‌లో
సాయంత్రం 6 గంటలకు ధుని వెలిగిస్తాము.
మానవుడి మనస్సు అంతులేని ఆలోచనలతో నిండి వుంటుంది.
మీ మనస్సులో ఆలోచనలు అపరిమితం.
కాబట్టి మీ మనస్సులోని ఏదో ఒక కోరికను
ఈరోజు ధునిలో అగ్నికి ఆహుతి చేయండి.
కామ, క్రోధ, మధ, మాత్సర్యాలలో ఒకదానిని ధునిలో ఆహుతి చేయమన్నారు.
**నీలు** నాతో చాలా కాలంగా వున్నాడు.
అతనేమంటాడంటే తనకు ఎలాంటి భగవత్ సాక్షాత్కారం వద్దంటాడు.
కేవలం బాబాతో ఉంటే చాలంటాడు.
బాసుంది, సిరా, లాంటి తీపి మిఠాయిలు నీలు బాగా ఇష్టపడతాడు.
కాబట్టి అతను ఇష్టపడే ఒక స్వీట్‌ని నేడు ధునిలో వేయమన్నారు.
మధ్యాహ్న భోజనం అయిపోయాక ఒకటిన్నర ప్రాంతంలో తిరిగి
మెహెరాబాద్ సమావేశ హాలులో సహవాసీలందరూ బాబా ఎదుట సమావేశమయ్యారు.
బాబా మౌనంగా చెబుతున్న మాటలను ఏరుచ్ ఇంగ్లీషులో,
కుటుంబశాస్త్రి గారు తెలుగులో అనువదించి చెప్తున్నారు.
బాబా ఏం చెప్తున్నారంటే మీరిక్కడ 5 రోజులపాటు వుంటారు.
నేను చెప్పేదానిలో నుండి సాధ్యమైనంత మేరకు అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి.
మీకు ఇలాంటి అవకాశం తిరిగి మరోసారి లభించదు.
ఏదో ఒకరోజున ఈ దేహాన్ని వదిలివేయవల్సిందే.
మీరు నన్ను తిరిగి చూడలేరు.
నా ఈ శరీరం వదిలేశాక ఎందరో కొన్ని వందలు, వేల సంఖ్యలో

ప్రజలు ఇక్కడికి తరలి వస్తారు.
కొంతమంది బాబా గురించి, బాబా సందేశాల గురించి వారికి తెలియజేస్తారు.
అయితే ఈ రోజు మీరు నాతో ఉండగల్గే సౌభాగ్యం మీకు లభించింది.
నా సమక్షంలో మీరు ఉన్నారు.
ఇది గొప్ప అవకాశం.
మీ జీవిత కాలంలో లభించిన గొప్ప సువర్ణావకాశం ఇది.
మీ అందరికీ స్వయంగా నేను చెప్తున్న మాటలు వినే అవకాశం లభించింది.
ఇది ఏ కొద్దిమందికో గాని ఈ అవకాశం దొరకదు.
మీరు ఆ విషయంగా ఎంతో అదృష్టవంతులు.
కాబట్టి నేను చెప్పే మాటలు శ్రద్ధగా ఆలకించండి.
ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.
నేను మీతో ఇప్పుడు చెప్తున్న మాటలు రాబోయే రోజుల్లో ప్రజలు
పుస్తకాలల్లో చదువుకుంటారు. ఇదంతా నిజం.
మండలిసభ్యుడు కైకోబాద్ గురించి చెప్తూ బాబా ఇలా అన్నారు.
కైకోబాద్ చాలా సంవత్సరాల నుంచి నా దగ్గర వుంటున్నాడు.
అతనికి భార్యా పిల్లలు ఉన్నారు.
అతను పార్శీయుడు.
పార్శీ అర్చక వంశీయుడు.
అతని భార్యా పిల్లలు మెహెరాబాద్ కొండపై ఉంటారు.
అతను మాత్రం నేను ఎక్కడ వుంటే అక్కడ వుంటున్నాడు.
నాతోపాటు ప్రయాణిస్తున్నాడు. గత 12 సంవత్సరాలుగా నాతో పాటు వుంటున్నాడు.
ఆనాటి నుండి నేటి దాకా ప్రతిరోజూ 24 గంటలలో కనీసం
ఒక లక్షసార్లు నా నామం స్మరిస్తుంటాడతను.
నా నామస్మరణే అతని శ్వాస అయ్యింది.
మెహెరాబాద్ కొండమీద 1946 ప్రాంతంలో అతనికి నా దివ్య దర్శనం లభించింది.
"నాకు అన్నింటా బాబా దర్శనం లభిస్తోందని" కైకోబాదు చెప్తాడు.
మీరు ఎంతో దూరం నుండి నా సహవాస్‌లో పాల్గొనేందుకే వచ్చారు.
కాబట్టి మీతో నేను చెప్పదల్చుకున్న ఎన్నో విషయాలు మీతో చెప్తాను.
బాబాను ఎలా దర్శించుకోవాలో ఆ మాదిరిగా కైకోబాదు బాబాను
దర్శించుకుంటున్నాడు.
అందుకని ప్రతిరోజూ నేను అతనికి పాదాభివందనం చేస్తాను.
నేను నా మండలికి, పేదవారికి సాధు సజ్జనులకు కుష్ఠివారికి

ఇలా పలువురికి నేను పాదాభివందనం చేస్తుంటాను.
ఇది ఎవరినో ఆకర్షించేందుకు మాత్రం కాదు.
మానవాళి ఎడల గల నా ప్రేమకు చిహ్నంగా నేను ఈ మాదిరిగా చేస్తుంటాను.
నా విధి విధానాలు కూడా చెప్తాను. శ్రద్ధగా ఆలకించండి.
నేను మస్తుల కోసం కానీ, మరే ఇతర కార్యక్రమాలకైనా వెళ్ళేముందు
కైకోబాదును నా తలపై చెయ్యి పెట్టి ఆశీర్వదించమని అడుగుతాను.
ఇటీవల ఒకరోజున సతారాలో నేను ఆమాదిరి అడగ్గానే
కైకోబాదు కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు.
నీవు భగవంతుడవు నన్నెందుకు ఆశీర్వదించమని అడుగుతావన్నాడు.
నువ్వు సాక్షాత్తు ఈ యుగావతారుడివి.
ఆ అనుభూతి  నాకు నీ దగ్గర లభించింది.
నీవు ఆ మాదిరి అడిగినప్పుడు నేనెంతో బాధపడతానని కైకోబాదు వాపోయాడు.
విధేయుడవై నేను చెప్పింది చేయమని కైకోబాదుని ఆదేశించాను.
నేను ఏది చెబితే అది చేయడమే నీ పని.
గట్టిగా నన్ను ఒక తన్ను తన్నమన్నా
నీవు నా ఆదేశాన్ని పాటించాలని నేను కైకోబాద్‌తో చెప్పాను.
కైకోబాద్ ఈ ఆధ్యాత్మిక పథంలో ఇంకా ముందుకు సాగాలి.
అతను నా దివ్య దర్శనం పొందుతున్నాడే తప్పించి ఇంకా ఐక్యత స్థాయికి చేరలేదు.
నేలపై క్రింద కూర్చున్న మొసలికంటి తిరుమలరావు గారి కాళ్ళు గట్టిబడిపోయాయి.
అటూ ఇటూ కదులడానికి ఇబ్బంది పడుతున్నాడాయన.
ఇది గమనించిన మెహెర్‌బాబా ఏమన్నారంటే
మీలో ఎవరికైనా కాళ్ళు నెప్పులుగా వుంటే,
కాళ్ళు బారజాపుకుని, మీకెలా సుఖవంతంగా వుంటే అలా కూర్చోండి.
ఎదురుగా నేనున్నానని, నాఎదుట కాళ్ళు ఎలా బారజాపుకోవాలని ఆలోచించకండి.
మనందరం సహవాస్‌లో వున్నాం.
మీరు అత్యంత సుఖంగా కూర్చుంటే నేను ఆనందిస్తాను.
హాయిగా సుఖంగా ప్రశాంతంగా కూర్చోండి.
ఎలాంటి ఇబ్బంది లేకుండా మీరు సౌకర్యవంతంగా కూర్చోండి.
ఈ మాటతో తిరుమలరావుతో పాటు ఇతర సహవాసీలందరూ కూడా
హాయిగా కాళ్ళు చాపుకుని ప్రశాంతంగా వారికి ఇష్టమైన రీతిలో
సుఖవంతంగా కూర్చున్నారు.

**(సశేషం)**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

బాబావారు హర్వాన్‌కి వచ్చిన మర్నాడు అంటే ఆగస్టు 4వ తేదీన
ఓ కాశ్మీరీ కుర్రాడు ప్రభు దర్శనం చేశాడు.
ఈ సంగతి పాఠకులకి గుర్తుంది కదా!
"మీ బాబాగారిని చూడాలనివుంది", అని పదే పదే అంటూంటే,
రావ్‌సాహెబ్ ఆ కుర్రాడిని బాబావారి సముఖానికి తీసుకువచ్చారు.
పండిట్ మహమ్మద్ దుకాన్‌దార్ వాడిపేరు.
"నీకేమి కావాలిరా", అని బాబావారు అడిగారు ఆ కుర్రాడిని.
'అబ్బే! నాకేమీ వద్దు ఇప్పుడు. మళ్ళీ వస్తాను కదా, అప్పుడు అడుగుతాను,
ఇప్పుడు కాదు" అన్నాడు. ఈ సంగతీ పాఠకులకి గుర్తువుంది అనుకొంటాము.
ఈ కుర్రాడి ప్రస్తావన ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందంటే,
అలా అగస్టు 4న ప్రత్యక్షమయి,
చిటికెలో మాయమయిన మనవాడు,
ఈవాళ అంటే ఆగస్టు 10వ తేదీన బాబావారి కుటీరానికి వచ్చాడు.
పాదాభివందనం చేశాడు.
"ఇదిగో, ఈ లాకెట్టు తీసుకో" అంటూ,
బాబావారు ఓ అందమయిన లాకెట్టుని వాడి చేతిలో పెట్టారు.
"మహాప్రసాదం" అంటూ, భక్తితో కళ్ళకి అద్దుకొన్నాడు.
లాకెట్టులో బాబావారి ఫోటో కనిపించింది.
ఆనందంతో పొంగిపోయాడు.
"నా కోర్కెని ప్రభువు మన్నించారు.
ఇంతకంటే ఇంకేమి కావాలి నాకు, అనుకొన్నాడు.
ఎవరికి ఏది ఎప్పుడు ఇవ్వాలో,
అదీ ఏ ప్రకారంగా అందజేయాలో పరాత్పరుడికి తెలుసు.
అందుకనే కదా భగవంతుని సన్నిధిలో ఏమి కోరినా కోరికలు తీర్చే

ఇలవేల్పుకి విన్నపాలు అక్కర్లేదు అని పెద్దలు అంటారు.
మన కాశ్మీరీ కుర్రాడు పెద్దల బాటలో నడిచాడు.
ప్రభువు మెచ్చి, కోరిక తీర్చాడు. అతను వెంటనే ఇంటిదారి పట్టాడు.
బాబావారు వాపసు ప్రయాణానికి ముహూర్తం పెట్టారు.
అది రేపే అన్నారు.
అంటే ఆగస్టు 11న హర్వాన్ నుంచి బయలుదేరాలి.
ఈ సంగతి ఊళ్ళో తెలిసింది.
చిన్నా పెద్ద అందరూ బాబావారి దర్శనానికి తరలివచ్చారు.
మెహెర్‌బాబా వారి రాకతో మా ఊరు పావనమయిందన్నాడు గ్రామ పెద్ద.
ప్రభువుకి మా నమస్సుమాంజలి అర్పించాలి.
దర్శనమిప్పించండి అన్నాడు.
అతగాడి వెంట వచ్చిన జనం అంతా బారులు తీరి నిలబడ్డారు.
చడీ చప్పుడు చేయకుండా,
బాబావారిని దూరం నుంచే దర్శించి అంజలి ఘటిస్తామన్నారు.
కానీ పాపం వాళ్ళ కోర్కె తీరలేదు.
ఎందుకంటే బాబావారు మూడు రోజులుగా ఎవరికీ దర్శనం ఇవ్వటం లేదు.
ఈ సంగతే చెప్పారు మండలివారు.
బాధపడకండి, ప్రభువాజ్ఞ, ఏంచేస్తాం అని వాళ్ళని సముదాయించారు.
నిరాశతో వాళ్ళు వెనక్కి తిరిగారు.
ఓ చిన్నారికి అడగకుండానే ప్రభువు ప్రసన్నమయ్యాడు.
ఈ పెద్దలకి ఆమడ దూరం నుంచి కూడా దర్శించే భాగ్యం ప్రసాదించ లేదు.
ఎందుకు అని ప్రశ్నించకండి. ప్రభువు ఇచ్ఛ అది.
ప్రభువాజ్ఞకి ఎదురు ప్రశ్న వేయకూడదు.
ఇదే మనం మండలివారినుంచి నేర్చుకోవలసిన సద్గుణం.
సరే, ఇహ మళ్ళా మెహెరీయంలోకి వస్తే...
బువాసాహెబ్, పాద్రీ, రమ్జూ, విష్ణు, ఛాన్జీ కొండపైకి వచ్చారు.
అప్పటికి గోద్రాకి వేళ దాటింది. చీకట్లు ముసురుకొంటున్నాయి.
హర్వాన్ కొండ ఎక్కే అవకాశం మళ్ళా రాదు వాళ్ళకి.
ఎందుకో తెలుసు కదా. రేపేగా ప్రయాణం.
మళ్ళా ఇక్కడికి వస్తామా ఏమన్నానా?
ఈ హర్వాన్ యాత్రకి గుర్తుగా ఫోటోలు తీస్తానన్నాడు పాద్రీ.
ప్రభువు సరేనన్నారు.

అంతే ఎన్నో ఫోటోలు తీశాడు.
ఇక్కడి జ్ఞాపకాలని కెమెరాలో నిక్షిప్తం చేశాడు.
బాబావారి కుటీరాన్ని వివిధ కోణాల్లో ఫోటో తీశాడు.
బాబావారినీ ఫోటోలు తీశాడు.
అక్షర ఫలకం పట్టుకొన్నప్పుడు,
కుటీరంలో కూర్చున్నప్పుడు ఇలా ఎన్నో ఫోటోలు తీశాడు.
పాద్రీ కొండపైకి వస్తూ పాద్రీ బాబావారి ఫోటో తెచ్చాడు.
బాబావారి గదిలో పెట్టాడు. ఎందుకో తెలుసా!
బాబావారి బసకి ఈ ఫోటో ఓ తీపిగుర్తు అన్నాడు.
ఫోటోల పర్వం అయ్యేసరికి ఏడు అయింది.
మండలివారు కొండ దిగారు.
హర్వాన్ కొండపై బాబావారు ఏకాంతవాసం వున్నారు ఇంకో రోజు.
తెల్లవారుతూనే (ఆగస్టు 11న) నేను రడీ అన్నారు బాబావారు.
మండలివారూ చిటికెలో తయారయ్యారు.
సామాన్లు బస్సు ఎక్కించారు.
గడియారం ఎనిమిది కొడుతుంటే, బస్సు కదిలింది.
ఇంత మందీ ప్రొద్దున్నే బయలుదేరాలా ఏమిటి?
కాస్తంత ఎండ ఎక్కాక, ఉపాహారం చేసి హర్వాన్ నుంచి శలవు తీసుకోవచ్చు కదా.
ఈ ఐయిడియా బాగుంది కానీ, ఓ చిక్కు వుంది.
ప్రొద్దు ఎక్కిందీ అంటే ఊరు మేలుకొంటుంది.
అందరూ కదిలి వస్తారు. బారుల తీరి నిలబడతారు.
దర్శనం, ఆశీస్సులు ఆశిస్తారు.
దీనితో వెంటనే బయలుదేరటం కుదరదు.
కాబట్టి పెందరాళే వెళ్ళిపోదాం అన్నారు బాబావారు.
సరేనన్నారు మండలివారు.
బస్సు కదిలింది. కాశ్మీర్ కొండలు వెనకపడుతున్నాయి.
రోజూలాగ, ఈవాళ కూడా కమిలీ కోటుగా మనకందరికీ తెలిసిన
నల్లకోటు వేసుకొన్నారు బాబావారు.
ఎందుకో, ఏమో కోటు తీసేశారు.
ఉక్కపోస్తోందని కోటు తీసేశారా!
అబ్బే అదేమీ లేదు, కొంచెం చలి చలిగానే వుంది.
అంటే బాబావారు కాశ్మీర్‌లో చేసిన దైవీ కార్యక్రమంలో

ఈ నల్లకోటుకీ కాస్తంత చోటు వుందనుకోవాలి.
అది ఏమిటో మనకి తెలీదు ఎన్నో ఆధ్యాత్మిక విషయాలని
సావధానంగా సోదాహరణంగా చెప్పే బాబావారు ఈ నల్లకోటు రహస్యం
వివరించ లేదు ఎందుకనో మరి.
ఈ నల్లకోటుకి ఎన్ని చిల్లులు పడ్డాయో, ఎన్నిసార్లు చిరిగిందో చెప్పలేము.
అయినా సరే ఆ చిరుగులకి అతుకులు వేయించి వేసుకొనేవారు తప్ప
నాకు వద్దు ఈ అతుకుల పాత బొంత అనలేదు.
బాబావారికి ఎంతో ఇష్టం నల్లకోటు అంటే, ఇంకో గమ్మత్తు ఏమిటీ అంటే,
పాద్రీ హర్వాన్ కొండపై తీసిన ఫోటోలు ఒక్కటీ దక్కలేదు.
అతని తప్పేమీ లేదు. ఫోటోలని డెవలప్ చేయించడానికి పాద్రీ పంపాడు.
అవి తిరిగి రాలేదు. బాబావారి కోటుపైనా,
మాయమయిన ఫోటోల పైనా మనం దృష్టి పెడితే,
ఈ రెండింటిలో ఏదో గూఢార్థం వుందని అనిపించక మానదు.
పాపం ఫోటోలు పోయాయని పాద్రీ ఎంతో బాధపడ్డాడు.
ఈ ఫోటోలు ఎలా మాయమయ్యాయి? అదో పెద్ద కథ.
ఆ కథ ఇప్పుడే కాదు. కాసేపయ్యాక.
ఇప్పుడు మన దృష్టి బాబావారి బస్సు యాత్రపైన.
హర్వాన్ నుంచి బయలుదేరి ఓ రోజు అయింది.
ఈవాళ ఆగస్టు 12వ తేదీ. బస్సు వేగంగా దూసుకుపోతోంది.
మజిలీ పానిపట్‌లో. భారత దేశ చరిత్రలో పానిపట్‌కి ఓ ప్రత్యేక స్థానం వుంది.
అక్కడ ఎన్నో యుద్ధాలు జరిగాయి.
పానిపట్ చేరడానికి నాలుగు రోజులు పడుతుందట.
మండలివారు ప్రకృతిపై దృష్టిపెట్టారు.
ఇంతలో బాబావారు ఓ పరీక్ష పెట్టారు వాళ్ళకి.
“ఈవేళ ఉపవాస దీక్ష విరమిస్తాను.
పప్పు, అన్నం వండండి” అన్నారు.
బస్సుని ఆపమంటారా అని అడిగారు మండలి.
అబ్బే “ఎందుకు బస్సు ఆపడం ఈ చిన్న పనికి.
నడుస్తున్న బస్సులోనే ఓ మూలగా స్టౌవ్ వెలిగించండి.
పని అయిపోతుంది” అన్నారు బాబా.
బస్సు వెడుతున్నది రాచబాట కాదు. గతుకుల రోడ్డు.
ప్రతి కుదుపుకీ ఎత్తి ఎత్తి పడుతున్నారు.

నదుం విరిగినంత అవుతోంది.
వంట సంగతి అలా వుంచండి.
గతుకుల్లో పడగానే స్టౌవ్ గంతులువేయదు.
దాన్ని పట్టుకోవటం ఎలా? ఇదొక ధర్మ సందేహం.
ఎవరికీ పాలుపోలేదు. దేవ దేవుడే వేశాడు ఆర్డరు.
ఆ కష్టమేదో ఆయనే చూసుకొంటాడు మనం చేసేదల్లా
స్టౌవ్ వెలిగించడమేనన్నాడు రమ్జూ.
నిజమే సుమా అన్నాడు విష్ణు. వీరిద్దరూ ఆనాటి నల భీములు.
వంటకి ఉపక్రమించారు.
బస్సు వెనకసీట్ల దగ్గర చోటుంటె, అక్కడ స్టౌవ్ వెలిగించారు.
పప్పు కడిగి స్టౌవ్‌పైన పెట్టారు. బస్సు కుదుపులకి స్టౌవ్ గెంతులు వేస్తోంది.
గిన్నె ఎగిరి ఎగిరి పడుతోంది.
అయితే నేం, మన నల భీములు పట్టు వదల్లేదు.
బాబావారి నామస్మరణ చేస్తూ, స్టౌవ్‌ని గట్టిగా ఒకరు పట్టుకుంటే,
గిన్నె పడకుండా ఇంకొకళ్ళు కుస్తీ పడుతున్నారు.
ఎగిసి పడే స్టౌవ్ మంటల్లో చేతులు కాల్తున్నాయి.
అయినా పట్టించుకోలేదు. పప్పు వుడికింది.
వెంటనే ఓ గ్లాసుడు బియ్యం కడిగి అత్తెసరు పెట్టారు.
అదీ వుడికింది. బాబా వారికి ప్రేమతో వడ్డన చేశారు.
అలనాటి కుచేలుడి కథ విష్ణుకి గుర్తుకు వచ్చింది. ఔరా!
ఏమిమాయ అనుకొన్నాడు.
వీళ్ళ కష్టం బాబావారికి తెలియకపోతే కదా!
అయినా ఏమీ తెలీనట్లు అడిగారు!
చేతులు కాలాయా మీకు అని ప్రశ్నించారు.
కాలటమా! ఏమన్నానా బొబ్బలు ఎక్కాయి.
ఇవి తగ్గేది ఎప్పటికో అన్నాడు రమ్జూ.
మీ కష్టం వూరికే పోదులే అని సముదాయించారు.
మీ రుణం వుంచుకోనన్నారు.
నాకోసం చేతులు కాల్చుకున్నారు మీరిద్దరు.
ఈ పేరు చెప్పి రుణగ్రస్తుడని చేశారు.
సరే మీ శ్రమకు తగ్గ ఫలితం ముట్టచెప్తానన్నారు.
అది ఎప్పుడు బాబా అని వారిద్దరు ఆత్రంగా అడిగారు.

బాబావారు చిరునవ్వు నవ్వారు.
"ఎప్పుడా! చూద్దాం! ఎప్పుడో ఒక రోజుకి" అన్నారు.
అలా సాగిన బస్సు యాత్ర ఆగస్టు 15న పానిపట్ చేరింది.
బాబావారు అందరికీ టీ పెట్టారు.
స్టౌవ్ వెలిగించడంలో, కప్పులో టీ పోయడంలో మీ కెందుకు ఆ శ్రమ నేనున్నానుగా అన్నాడు ఆఘా ఆలీ.
వాడి హుషారుకి, బాబా సంతోషించారు.
అందరూ టీ త్రాగాక బాబావారొక మాట అన్నారు.
ఈవాళ్టి నుంచీ మనం ఎక్కడా సత్రంలోనో హోటల్లోనో దిగవద్దు.
ఊరి బయట, రోడ్డు ప్రక్కనో, చెట్ల క్రిందో బస చేద్దాం అన్నారు.
కాశ్మీర్ వెళ్ళేటప్పుడు దర్జాగా హోటళ్ళలోనో, సత్రాల్లోనో బస చేశారు.
ఇప్పుడు అవని – గగనం రెంటి మధ్య బస.
నీలాకాశంలో నక్షత్రాలు మిణుక్కు మిణుక్కు మెరుస్తుంటే,
పచ్చిగడ్డి పైన హాయిగా పడుకొందాం అన్నారు బాబా.
అందుకనే, పానిపట్ దాటాక భోజనం కోసం ఊళ్ళో ఆగడం,
చీకటిపడ్డాక నిద్ర ముంచుకువస్తుంటే చెట్టుక్రిందో, నడి రోడ్డునో,
ఎక్కడ పడితే అక్కడ బస్సు ఆపేవారు.
పురుషులు క్రింద పరుచుకొని పడుకొనేవారు.
వర్షం వస్తే! వస్తే ఏముంది ఆగస్టు నెలలో వర్షాలు వద్దన్నా పడతాయి.
ఆరుబయట పడుకున్నవాళ్ళు తడిసి ముద్దవుతారు.
మన మండలివారూ అంతే, వర్షం పడితే తడిసిపోయేవారు.
ఇదొక రకం శిక్షణ.
అన్నింటికీ సిద్ధమయి, బాబానే నమ్మివచ్చినవాళ్ళకి, వర్షం పెద్ద లెక్కలేదు.
ఆగస్టు 16న బస ఓ నిర్జీవ ప్రదేశం.
అక్కడికి ఆగ్రా ఎనిమిది మైళ్ళు.
ఇక్కడ బస చేశారు అనేకంటే, భోజనం కోసం ఆగారు అంటే సబబు.
ఆ జాగాని చూపించి బస్సుని ఆపించిందీ బాబావారే.
ప్రభువే స్వయంగా వంట చేశారావేళ.
అందరికీ వడ్డన చేశారు.
ఆలీ ద్వయం, ఆఘా ఆలీ, ఆలీ అక్బరు బాబావారికి వంటలో సాయపడ్డారు.
భోజనమయ్యాక అందరూ బస్సు ఎక్కారు.
పాద్రీ ఎప్పటిలా బస్సు నడుపుతున్నాడు.

భోల్పూరు – గ్వాలియర్‌ల మధ్య సైనిక కేంద్రాలున్నాయి.
ఆ దారిన వెడుతుంటే, పాద్రీని చూసిన సైనికులు ఇతగాడు ఓ ఆర్మీ ఆఫీసరు అనుకొని శాల్యూట్ చేశారు.
మనిషి ఒడ్డు పొడుగే కాకుండా వేసుకొన్న బట్టలు కూడా దూరానికి పాద్రీ ఆర్మీవాడు అనుకొనేలా వున్నాయి.
అందుకనే ఆ దారిలో చాలామంది సైనికులు పాద్రీకి శాల్యూట్ చేశారు.
భోల్పూరు, గ్వాలియర్లలోనే కాదు, గునాలో కూడా సైనికులు శాల్యూట్ చేశారు.
ఇదిచూసి, పాద్రీకి నవ్వు ఆగ లేదు. పకపకా నవ్వాడు.
ఏమయింది అంటే అన్నాడు కదా, రాత్రి – పగలు ఈ బస్సు నడుపుతున్నాను.
నాకెవరూ సహాయం లేదు.
మొత్తం దూరం నేనే డ్రైవరుని. ఒళ్ళు హూనమవుతుంది.
అయినా బాబాకి నా మీద కనికరం లేదు, సరికదా రుసరుసలాడుతూనే వుంటారు.
అయినదానికీ, కానిదానికీ విసుక్కొంటారు. ఏడిపిస్తుంటారు.
ఈ జవాన్లకి ఏమి తెలుసు నా తిప్పలు.
నేనేదో ఘనంగా బస్సు నడుపుతున్నాననుకొంటున్నారు.
పిచ్చివాళ్ళు వాళ్ళు అన్నాడు.
అందరూ సరదాగా నవ్వుకున్నారు.
గ్వాలియర్‌లో కాసేపు ఆగినప్పుడు హర్వాన్ ఫోటో రీలుని అహమ్మద్ నగర్‌కి పంపాడు.
జాగ్రత్తగా చేరుతుందా సార్ అని పోస్ట్ మాస్టర్‌ని పదే పదే పడిగాడు.
“మీ కెందుకీ భయం.
భద్రంగా చేరుతుంది మీ ఊరు” అన్నాడా మహానుభావుడు.
కొరియర్ సర్వీస్సులేని ఆ రోజుల్లో
ఉత్తరాలు, పాకెట్లు పంపడానికి పోస్టాఫీసే దిక్కు.
అప్పట్లో పోస్ట్ చేసిన ఉత్తరాలు, ప్యాకెట్లు జాగ్రత్తగానే చేరేవి.
మహాత్మా గాంధీ కేరాఫ్ ఇండియా అని వ్రాసినా, మహాత్ముడు ఎక్కడుంటే అక్కడికి ఆ ఉత్తరం చేరేది.
ఆ భరోసాతోనే పాద్రీ తన హర్వాన్ ఫొటో రీలుని పోస్ట్‌లో పంపాడు.
నగర్‌లో తెలిసిన ఫోటో గ్రాఫర్‌కి.
ఇవి అపురూపమయిన ఫోటోలు.
జాగ్రత్తగా డెవలప్ చేయి అని ఉత్తరం కూడా వ్రాశాడు.
ఆ ఉత్తరం కానీ, ఫోటో రీలు కానీ నగర్ చేరలేదు.
గల్లంతు అయ్యాయి.

ఎంతగా వెతికించినా దొరకలేదు.
అలా హర్వాన్ ఫోటోలు చరిత్రకి దక్కలేదు.
హర్వాన్ కొండ దగ్గరే ఏసు ప్రభువుని సమాధి చేశారని బాబావారన్నారు.
అలనాటి యుగావతారుడి సమాధి స్థలం కనబడనట్టే,
ఈ యుగావతారుడి హర్వాన్ కార్యక్రమ గుర్తులు మిగలలేదు.
ఇదొక లీల. ఊహకి అందని దైవీ లీల.
అంతుచిక్కని ప్రహేళ.
ప్రతి అవతార కాలంలోనూ ఇంతే!
దైవీ కార్యక్రమం ఊపు అందుకోడానికే అంతా!
ఏసుక్రీస్తు లీలలు మనకి ఎన్ని తెలుసు.
శిలువ అయ్యాక ప్రభువు ఇండియా వచ్చాడని తెలుసా!
హర్వాన్ వద్ద ఏసు సమాధి వుందని తెలుసా!
ఏమి తెలుసు ఆ అవతారుని గురించి ఒకటి మాత్రం స్పష్టం!
మెహెరావతార ప్రకటన సుముహూర్తం చెప్తుంది దైవీ లీలలకి భాష్యం.
ఇది కవి వాక్కు.
అది బ్రహ్మవాక్కు.
ఆగ్రా దగ్గరపడుతుంటే ఓ ఊళ్ళో బస్సుని ఆపించి,
బాబావారే వంట వండి, అందరికీ వడ్డించారని చెప్పుకొన్నాము కదా!
ఇది ఏదో ఒకరోజు సరదా కాదు.
రోజూ బాబావారే స్వయంగా వంట చేస్తున్నారు.
నలుగురికీ ప్రసాదం పెడ్తున్నారు.
ప్రసాదం అని కళ్ళకి అద్దుకొని తింటున్నారు మండలివారు.
ఇది ఏదో బాగుందే అనుకొంటున్నారేమో,
అలా అనుకొంటే పప్పులో కాలువేసినట్లే.
ఎందుకంటే, వడ్డనతోపాటు చురకలు వేస్తున్నారు బాబా.
ముద్ద దిగటంలేదు ఆ చురకలతో.
"అలసిపోయారా! మీరంతా! పాపం! కానివ్వండి! ఏంచేస్తాం! నేనున్నానుగా!
నేను వండిపెడతాను! చీకూ చింతా లేకుండా హాయిగా ఊపిరి పీల్చుకోండి మీరు!"
ఇలా సాగుతున్నాయి చురకలు.
బాబావారి మాటలు వింటుంటే, గుండెలు పిండేసినట్లుంది.
పోనీ మేము వంట చేస్తాం బాబా,
మీకెందుకు ఆ శ్రమ అని అందామా అంటే,

అసలు అవకాశం ఇస్తే కదా! బాబావారు!
వంట వార్పుకి దూరంగా కుర్చోపెట్టారు.
ప్రభువు ఆజ్ఞని శిరసావహించడమే తప్ప,
ఇది కాదు, అది కాదు అని చెప్పటం చేతకాదు మండలివారికి.
బాబావారి చురకలు కొరడా దెబ్బల్లా వున్నా,
ఏమీ పాలుపోవటం లేదు వాళ్ళకి.
మాటలు తూటాల్లా తగులుతున్నాయి.
ఒక్కోసారి గుండెని గాయం చేస్తున్నాయి.
నిస్సహాయుల్ని చేస్తున్నాయి. అవమాన భారంతో క్రుంగిపోతున్నారు.
కానీ పెదవి కదపటం లేదు.
ఎందుకో తెలుసా!
ప్రభువు ఏమి చేసినా మన కోసం,
మానవాళి కోసం చేస్తారన్న నమ్మకం వారిది.
అవతారుని శిక్షణలో వారు నేర్చుకొన్న పెద్ద పాఠం ఇదే.
ఆగస్టు 18న కుండపోతగా వర్షం కురిసింది.
బస్సు టాపుపైన వున్న పరుపులు తడిసి పోయాయి.
ఆ రాత్రి అందరికీ కాళ రాత్రి అయింది.
కటిక నేల మీద పడుకోవటం, అదీ రోడ్డు ప్రక్కన. మాటలు కాదు.
అదీ బురద బురదగా వున్న చోట.
ఇది ఇంకొక శిక్షణ కావచ్చు.
ఇలా తడుస్తూ, ఎండుతూ ఇండోర్ చేరారు అందరూ.
అక్కడికి గుస్తాద్‌గారి తమ్ముడు శ్లామ్‌సన్ వచ్చాడు.
మీతోపాటే నేనూ అంటూ బస్సు ఎక్కాడు.
ఇండోర్ మహత్యం ఏమిటో కానీ, బాబావారి చురకలు తగ్గాయి.
వంటలో సహాయం చేస్తామంటే సరే చేయండి అంటున్నారు.
ఇండోర్ తర్వాత మజిలీ నిమ్రాణికి.
ఆ ఊరు ఇంకా 31 మైళ్ళు వుందనగా పాలఘాట్ వచ్చింది.
ఇక్కడ బస్సు ఆపండి అన్నారు బాబా.
బస్సు ఆగింది. టీ తయారు చేశారు మండలి.
టీ త్రాగాక, బాబావారు నర్మద ఒడ్డుకు వెళ్ళారు.
వెంట ఆలీ ద్వయం, రావ్ సాహెబ్ కదిలారు.
మిగతావాళ్ళని బస్సు దగ్గరే వుండమన్నారు.

నర్మదలో స్నానం చేసి వస్తామన్నారు.
సరేనన్నారు మండలి.
కాస్త దూరం వెళ్ళారో లేదో, మీరూ రండి అని కబురు పెట్టారు వాళ్ళకి.
బాబావారికి స్నానం చేయించారు అందరూ.
తమ స్నానం అయ్యాక బాబావారు గుస్తాద్ గారికి స్నానం చేయించారు.
ఎంత అదృష్టవంతుడివయ్యా గుస్తాద్!
అవతారుడే స్వయంగా స్నానం చేయిస్తున్నాడు నీకు అని ఎకసెక్కమాడారు.
బాబావారు సరదాగా వున్నారని గమనించిన పాద్రీ వెంటనే ఫోటోలు తీశాడు.
ఆ రాత్రి వంట రమ్జూ, పాద్రీ చేశారు.
విష్ణు కూడా వాళ్ళతో చేయి కలిపాడు.
ఈ ముగ్గురూ పిండి వంటలు వండలేదు.
ఏదో మామూలు పప్పు అన్నం తయారుచేశారు.
బాబావారితో సహా అందరూ హాయిగా భోజనం చేశారు.
ఆ ముగ్గుర్నీ బాబావారేమీ అనలేదు సరికదా,
ఆవేళ్టి నుంచి వంట పని మానేశారు.
ఇదేగా మనవాళ్ళు కోరుకున్నది.
ఆనందంతో గెంతులు వేశారు.
బాబావారి చురకలు తప్పాయని కాదు వాళ్ళ సంతోషం.
బాబావారికి వంట శ్రమ తప్పింది కదా అని ఆనందం వాళ్ళది.
అందుకనే అయ్యారు వాళ్ళు మండలివారు.
అందరికీ దొరుకుతుందా ఆ అదృష్టం.
బస్సు ఎక్కడ వంట కోసం ఆగినా,
అంట్ల గిన్నెలు కడిగే పని విష్ణుపై పడింది.
గిన్నెల్ని శుభ్రంగా అతగాడు కడుగుతుంటే బాబావారు నీళ్ళు పోసేవారు.
ఇది ఏదో మామూలు పని మన దృష్టిలో.
అంట్ల గిన్నెలు కడిగిస్తూ మెహెర్ ప్రభువు చేస్తున్నది తమ ఆంతరంగిక దైవీ కార్యక్రమం.
ఇది మన దృష్టికి అందదు.
అదొక లీల.
రాత్రి పగలు బిజీ బిజీగా కనిపించే బాబావారు తమ ఆంతరంగిక కార్యక్రమాన్ని
ఎంతగా చేస్తున్నారో చెప్పలేము.
బహుశా మండలివారికి కూడా విశదమయ్యేదో కాదో
ఆ దైవీ కార్యక్రమం. **(సశేషం)**

## గుర్తుంచుకోవల్సిన రోజులు

# మెహెరాబాద్‌లో పసిడి వేడుకలు

**2015 నవంబరు 13, 14 తేదీలలో**

మెహెర్‌బాబా ట్రస్టు, మెహెరాబాద్ గ్రంధాలయ కమిటీ, 2015 నవంబరు 13, 14 తేదీలలో మెహెరాబాద్‌లో మెహెర్‌బాబా 1965 మే 1 నుండి 6 వరకు పూణేలోని గురుప్రసాద్‌లో తన ప్రేమికులకు బహిరంగ దర్శనం ఇచ్చారు.

బాబా ఇచ్చిన దర్శన కార్యక్రమం నిర్వహించి నేటికి 50 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా మెహెరాబాద్‌లో ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకునేలా స్వర్ణోత్సవ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆనాటి కార్యక్రమంలో మెహెర్‌బాబాను దర్శించుకున్న బాబా ప్రేమికులను ట్రస్టు ప్రత్యేకంగా ఆహ్వానిస్తోందన్నారు. వారు తమ అనుభవాలను, అనుభూతులను, జ్ఞాపకాలను పలువురితో పంచుకోవాలన్నారు. బాబా ప్రేమికులు 2015 మార్చి 30 లోపల తమ వివరాలను శ్రీగోకరణ్ శ్రీవాత్సవ, మెహెరాబాద్, అహ్మద్‌నగర్

ఈమెయిల్: jaibaba@ambppct.org ఫోన్: 0241-2548777/499

తెలియచేయవల్సిందిగా కోరారు. 1965 నాటి దర్శన కార్యక్రమంపై తీసిన చలన చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

ఈ రెండ్రోజుల కార్యక్రమంలో పాటలు, భజనలు, నాటికలు ప్రదర్శించగోరు బాబా ప్రేమికులు ముందుగా శ్రీ గోకరణ్ గారికి తెలియచేయవల్సిందిగా మనవి.

భోజన, వసతి కోసం మెహెరాబాద్ ట్రస్టు, మెహెరాబాద్

email: pimco@ambppct.org, Ph: 0241-2548733/36

తెలియచేయవల్సిందిగా కోరుతున్నారు.

# రాబోయే సంచికలో...

1954 నవంబరు 6న మెహెర్‌బాబా పండరిపురం వెళ్ళారు.
వేలాది భక్తజనసందోహం అవతారుని దివ్యదర్శనం చేసుకున్నారు.
గాడ్గే మహరాజ్ మెహెర్‌బాబాను పండరికి ఆహ్వానించారు.
ఆ వివరాలు సవివరంగా మెహెర్‌బాబా పాఠకుల కోసం
ప్రత్యేకంగా అందిస్తున్నాం!!

# ఉన్నతోన్నతుడు - మెహెర్‌బాబా

శ్రీమతి ఎస్. ఎస్. లక్ష్మి కృష్ణమూర్తి, కాకినాడ.

ఎన్నో యుగాలు తపస్సు చేస్తే గాని భగవంతుని గురించిన జ్ఞానం కలుగదంటారు. భగవంతుడే మన మధ్యకు దిగి వచ్చినా మనం ఆయనను గుర్తించలేము. ఆయన కార్యవిధానం మనకు అంతుపట్టదు. మాయలో జీవిస్తున్న మనకు భగవంతుని విశిష్టత అర్థం కాదు. అనుభవ జ్ఞానం పొందినవారు మాత్రమే భగవంతుని గురించి చెప్పగలరంటారు బాబా. అందుకే బాబా "మానవబుద్ధి, తెలివి పరిమితమైనవి. బుద్ధితో భగవంతుని తెలుకోవడం దుర్లభం. నీ హృదయంలో ఉన్న భగవంతుని హృదయపూర్వకంగా ప్రేమించుట ద్వారా ఆయనను పొందడం సాధ్యమవుతుంది. అవతార పురుషుడనైన నన్ను అధికాధికంగా ప్రేమించినప్పుడు నేను మిమ్ములను భగవదనుభూతి అనే గమ్యం చేరుస్తానన్నారు".

అనాదిగా మనవుడు భగవంతుని ఆరాధించినప్పటికీ, యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించినప్పటికీ తన బుద్ధితో భగవంతుని తెలుసుకోలేదు. ఆధ్యాత్మిక గ్రంధాలు ఔపోసన పట్టినప్పటికీ భగవంతుని గురించిన అనుభవ జ్ఞానం కలుగదు. ఒక్క అవతారపురుషుడు లేక సద్గురువు మాత్రమే సత్యాన్ని బోధించి జ్ఞానాన్ని ప్రసాదించగలరు. అందుకే బాబా భగవంతుడు, పరిమిత బుద్ధికి అందనివాడని, వర్ణనాతీతుడని, ఊహకు అతీతుడని, వాదనలకు లొంగడని చెప్పి, కాబట్టి మీరు భగవంతుడనైన నన్ను అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యవద్దని నన్ను ప్రేమించడమే ఉత్తమమని తెలియచేసారు. గుళ్ళల్లో, కొండ కోనల్లో, భగవంతుడిని వెతకడం వలన ప్రయోజనం లేదని తనలోని పరమాత్మను దర్శించే ప్రయత్నం చెయమని ప్రబోధించారు. "భగవంతుడే సత్యం. కావున ఆయన మాత్రమే సత్యం గురించి చెప్పగలవాడు. మానవుడు కులమతాలకు లోబడి వేర్పాటు భావనతో అజ్ఞానాంధకారంలో పడిఉన్నప్పుడు మానవునిలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన జ్యోతి వెలిగించేందుకు భగవంతుడు అవతరిస్తాడు. మానవులు కర్మకాండలు, మతాచారాలు, పూజాధికాలతో నిమగ్నమై సద్వస్తువును జారవిడచుకోబోయే సమయంలో భగవంతుడు మానవ హృదయాలను మేల్కొల్పుటకై అవతరిస్తాడు. మానవునిలోని స్వార్ధం, ద్వేషం పరాకాష్టకు చేరినప్పుడు, యుద్ధాలు కరువు కాటకాలలో ప్రపంచం సతమతమవుతున్న వేళలో భగవంతుడవతరించి తన ఉనికిని చాటే ప్రయత్నం చేస్తాడని బాబా అన్నారు. అలా ఈ యుగావతారుడైన మెహెర్‌బాబా తన సందేశాల ద్వారా సామాన్యులకు కూడా అర్ధమయ్యే రీతిలో అనేక దేవరహస్యాలను వెల్లడించారు. సన్యసించడమే ఆధ్యాత్మికత అనుకునే వారికి నిజమైన సన్యాసం బాహ్యానికి సంబంధించినది కాదని ఆంతరంగికంగా సన్యసించి కోరికలను త్యజించాలని బోధించారు. మన మనసులలోని కపటం, స్వార్ధం, ద్వేషం,

సంకుచితత్వం తొలగించుకునేలా ఉపదేశాలిచ్చారు. ఏమతమైనా కులమైనా భగవంతుని దృష్టిలో అందరూ సమానమేనని చాటిచెబుతూ సహవాసాలు ఏర్పాటు చేసారు. పరమాత్ముని సన్నిధిని, ఆయన ప్రేమను ప్రేమికులకు రుచి చూపించారు. మతాలపట్ల సరికొత్త అవగాహనను కలుగచేసారు. భగవంతుడంటే ఎవరో తెలియని మనకు ఆయన కరుణామయుడని, ప్రేమమహాసాగరమని తెలియచేసారు. భగవంతుని దరికి చేర్చేది ప్రేమమార్గ మొక్కటే అని, నిస్వార్థ సేవే భగవదారాధన అని తెలియచెప్పారు. ఇలా తన అవతార కాలంలో మెహెర్‌బాబా ప్రతి క్షణం మానవాళి ఉన్నతికే శ్రమించి మన హృదయాలలో జ్ఞాన జ్యోతిని వెలిగించారు. భగవంతుని తత్వాన్ని మౌనంగానే తెలియచేసారు. భగవద్వచనం ద్వారా ఆత్మ పరమాత్మల సంబంధాన్ని, మన బుద్ధికి అందేలా వివరించారు.

ప్రతి మానవుడు ప్రాపంచిక సుఖాలను ఆశించి మహాపురుషులను ఆశ్రయించడం సర్వసాధారణం. అలా ఎవరైనా బాబా వద్దకు వస్తే చాలా చిరాకు పడేవారు. అటువంటి అవకాశాలను అందిపుచ్చుకుని బాబా మన అజ్ఞానానికి బాధపడుతూ పలు సందేశాలిచ్చారు.

అది 1953వ సంవత్సరం సెప్టెంబరు నెల 6వ తేది. అప్పుడు మెహెర్‌బాబా డెహ్రాడూన్‌లో ఉన్నారు. ఆనాడు మండలివారంతా భోజనానికి లోపలికి వెళ్ళారు. బాబాతో ఏరుచ్ మాత్రమే ఉన్నాడు. ఆ సమయంలో గేటు బయట ఒక కారు వచ్చి ఆగింది. అందులో నుండి కొందరు వ్యక్తులు కారు దిగి మతిస్తిమితం లేని ఒక స్త్రీని పట్టి తీసుకువచ్చి బాబా పాదాల ముందు కూర్చుండబెట్టారు. బాబా ఆమెను స్పృశించి తన నజర్ ఆమెపై ఉంటుందని ఆమెను తీసుకువెళ్ళమన్నారు. ఈ సంఘటన బాబాను కలచివేసింది. ప్రజలు నిజంగా తానెవరో తెలియని అజ్ఞానంలో ఉన్నట్లు భావించారు. తన ఆధ్యాత్మిక దివ్యత్వాన్ని, తన ఉన్నతోన్నత స్థితిని స్పష్టంగా తెలియచెయ్యాలనే ఉద్దేశంతో కాబోలు 1953 సెప్టెంబరు 7వ తేదీన 'ఉన్నతోన్నతుడను' అనే సందేశాన్ని చెప్పి వ్రాయించారు. ఈ సందేశం చదివాక మనలోని సందేహాలన్నీ పటాపంచలవుతాయనే మాట వాస్తవం. ఉన్నతోన్నతునిగా నమ్మినవారు చేయవలసినదేమిటో కూడా ఈ సందేశంలో బాబా స్పష్టం చేసారు.

బాబా వద్దకు కోరికలతో రావద్దని, బాధలను, కష్టాలను తొలగించమని అడుగవద్దని, సుఖ సౌఖ్యాల కొరకు ఆయనను ఆశ్రయించడం తగదని, ఉద్యోగం, ఆరోగ్యం కొరకు ఆశీస్సులను అడుగవద్దని చెప్పారు.

ఇంకా బాబా "నా నుండి ఏదో పొందాలని ఆశిస్తూ ఎన్నటికి నా ముందు మీ చేతులు జాచకండి. ఉన్నతోన్నతునిగా నమ్మి ఆశ్రయించిన నా ముందు నన్ను స్తుతించడానికే చేతులెత్తండి.

**"కమలాక్షునర్చించు కరములు, కరములు,**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ"**

అన్న పోతన భావం ఇదేననిపిస్తుంది.

అలా అవతారపురుషుడైన మెహెర్‌బాబా తన ఉన్నతోన్నతస్థితిని ప్రకటించి తనను ఆశ్రయించినవారు ఈ ప్రాపంచిక కోరికలతో రాకండి అని చెప్పడంతో అశాశ్వతమైన ఈ సుఖాలకు బదులు కోరికలు లేని స్థితిని అంటే మోక్షాన్ని మాత్రమే కోరుకోవాలని ఉన్నతోన్నతుడైన భగవంతుని ఆశ్రయం లభించాక మనకీ ప్రాపంచిక సుఖాలు అవసరమవుతాయా? అంత చిన్న కోరికలు కోరడం సబబుగా ఉంటుందా? ఆయన ఉన్నతోన్నతుడు కనుక శాశ్వతమైన బ్రహ్మానందస్థితినే ప్రసాదించగలవానిని అది తప్ప మిగిలినవి కోరుకోవడం అవివేకమవుతుంది.

ఈ సందేశంతో ఆయన స్థితిని తెలుసుకున్న బాబా ప్రేమికులు అమూల్యమైన ప్రేమ ప్రసాదాన్ని వరంగా కోరుకుని ఆయన ఇచ్ఛ ననుసరించి జీవితం గడుపుతూ ధన్యులమవడానికి ప్రయత్నిద్దాం.

# కొరియర్ సర్వీసు

2014 జూలై సంచిక ఇంకా రాలేదండీ అంటూ 2014 సెప్టెంబరు సంచికను ముద్రించి, పోస్టు చేశాక కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇందుకు పోస్టలు శాఖ అనేక కారణాలు చెబుతుంది. కేవలం 25 పైసలు పోస్టలు చార్జీతో పత్రికను బట్వాడా చేసే సౌకర్యం వారు కల్పిస్తున్నారు. ఐతే తమ ప్రాంతంలో మాస పత్రిక సక్రమంగా రావడం లేదని భావించేవారు, వ్యక్తిగతంగా కానీ లేదా కొందరు కల్సి ఒక గ్రూపుగా చేరి తమకు పత్రికను కొరియర్ సర్వీసులో పంపమని కోరితే ఆ ఏర్పాట్లు చేయగలమని మనవి.

ఐతే, అందుకయ్యే చార్జీలు సంబంధిత పాఠకులు భరించాలి సుమీ!!

# జీవిత సభ్యులు - సోషల్ ఆడిట్

అవతార్ మెహెర్‌బాబా సందేశాల వ్యాప్తికై అంకితమైన మాస పత్రిక మెహెర్‌బాబా. మీ బంధు, మిత్రులు చేత ఒక్కొక్కరు కనీసం ఒకరిద్దరినైనా సభ్యులుగా చేర్పించండి. మెహెర్‌బాబా నామవ్యాప్తికి కృషిచేయండి. మెహెర్‌బాబా పత్రిక ప్రారంభం నుండి సెప్టెంబరు 2014 వరకు జీవిత సభ్యత్వం చెల్లించినవారు మొత్తం 800 పైగా ఉన్నారు. జీవిత సభ్యుల వివరాలను సంబంధితులందరికీ తెలియజేసేలా జిల్లాలవారీగా ప్రతినెలా 2-3 జిల్లాల చొప్పున వీలువెంబడి ప్రచురించాలని నిర్ణయించడమైంది. తప్పొప్పులుంటే సరిదిద్దుకోవడానికి, సంపూర్ణ పారదర్శకత కోసం మేం చేసే ఈ ప్రయత్నంలో దయచేసి సహకరించవల్సింది. మరిన్ని వివరాలకు
ఫోన్: 99595 53218 లేదా malladisukku@gmail.com. తెలియజేయండి!!

# 'బుజావే' (గుజరాతి హారతి)

**రచన: అవతార్ మెహెర్‌బాబా**

1. బుఝావే నార జహల్లతనీ, ఎ కర కుదరతనె ఫరమాతు।
ఛె లాగీ ఆస భక్తోనే, కె బఖ్‌శే నూరే యిమాతు॥

2. ఆయా మురశద్ మెహెర్ బాబా, చరణపర్ తుజన ధరీఎ సర్।
ఖుదానా జాతథీ వాఖేఫ్, థయీ బేతో మెహెర్ బా తు॥

3. తుఝే మాలిక్ హాకీకతనొ, తు అశిక్‌భీ నె అరెఫ్ భీ।
తుఝే దరియాఎ వహెదత్ మారెఫతనో హోయీ తూఫా తు॥

4. హమో రహెరవనె ఆఎ సాలెక్, బబఖ్‌శజె జ్ఞాన యీజద్‌ను।
కె తు పరమాత్మా జ్ఞానీ ఛె, నె ముఖ్తారె యిరఫా తు॥

5. ఖుదానా ప్రేమనో పిలావో, పిలావి మస్త్ హమనెకర్॥
ఛె తుజ్‌పర్ జాన్ సదకె సాకీయా ఆపీదె పయమా తు॥

6. హమారీ నావ భర దరిఎ, తరావెతో హమే తరిఎ।
హమారా నాఖుదా అయ్ మెహెర్‌బాబా ఛె నిగే భాతు॥ (2 సార్లు)

బుఝావే నార జహల్లతనీ, ఎ కర కుదరతనె ఫరమాతు॥
ఛె లాగీ ఆస భక్తోనే, కె బఖ్‌శే నూరే యిమా తు॥

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు.

# 'బుజావే'

**(గుజరాతి హారతి - తెలుగు అనువాదం)**

1. ఓ భగవంతుడా! మాలో ఉన్న అజ్ఞానమనే
అగ్నిని ఆర్పివేయబడునట్లు ఆజ్ఞాపించుము
నీ ప్రేమికులు విశ్వాసము యొక్క
తేజస్సును పొందుటకు తపన జెందుతున్నారు.

2. ఓ ముర్షద్ మెహెర్ బాబా నీ పాదముల
చెంత మా శిరములుంచుతున్నాము
ఓ మెహెర్‌బాబా నీవు నీ దివ్యత్వాన్ని
పరిపూర్ణముగా ఎరుక పరిచినావు.

3. నీవు సత్యానికి ప్రభువు: నీవు ప్రేమికుడవు
మరియు ప్రియతముడవై ఒక్కరిగా నున్నావు
అనంతమైన జ్ఞాన ప్రవాహమై యుండి నీవు
ఏకత్వమనెడి మహాసాగరమై యున్నావు

4. ఓ ప్రభువా, బాటసారులైన మాకు
నీ వొక్కడివే పూజనీయుడవనెడి జ్ఞానాన్ని
ప్రసాదింపుము. పరమాత్ముడవైన నీవు
సర్వాంతర్యామి మరియు దివ్య సర్వజ్ఞుడవు అయి ఉన్నావు.

5. మాకు మత్తు కలిగేటట్లు కప్పులోని
భగవత్ ప్రేమను త్రాగునట్లు చేయుము.
ఓ సాకీ మా జీవితాలను నీకు త్యాగము చేసి
నీ నుండి దీనిని (ప్రేమను) పొందునట్లు చేయుము.

6. నడి సముద్రములోనున్న మా నావను నీవు
నడిపిన యెడల, మేము తేలుతూ వుంటాము
ఓ మెహెర్‌బాబా మా నావ నడిపే చోదకుడా
(కెప్టెన్) నీవే మా రక్షకుడవు.




# క్రొత్త పుస్తకం

అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర – **మెహెర్ ప్రభుచరితము, 6వ భాగము** ఇటీవల విడుదల చేశారు. అవతారుని కాలంలో 1936 జనవరి నుండి 1939 జనవరి వరకు జరిగిన పలు ముఖ్యాంశాలైన – మైసూర్ ఆశ్రమం ఏర్పాటు, మెహెరాబాద్ మరియు రాహూరి ఆశ్రమాలు, మెహెర్‌బాబా యూరప్ ప్రయాణం, మెహెరాబాద్ కొండపై చేపట్టిన పలు నిర్మాణాలు, బ్లూ బస్ ప్రయాణం విశేషాలు ఈ ఆరవ భాగంలో సరళమైన తెలుగులో అనువాదం జరిగింది. **ఇంగ్లీషు ప్రచురణ-లార్డ్ మెహెర్**-మూడవ వాల్యూం లోని పేజి నంబరు 1437 నుండి 1705 వరకు గల విషయాలను ఈ సంపుటిలో అనువదించినట్లు పేర్కొన్నారు. ఇంతవరకూ **మెహెర్ ప్రభుచరితము,**ఐదు సంపుటాలను మెహెర్ మౌనవాణి పబ్లికేషన్స్, హైదరాబాద్ తరఫున శ్రీ యం.వి.ఆర్.కె. బాలాజీ సుమారు రెండు వేల ఒక వంద పుటలలో ప్రచురించిన విషయం పాఠకులకు తెలుసు. ఈ సంపుటిలో 300 పేజీలు వున్నాయి. ప్రస్తుతం, మెహెర్ ప్రభుచరితము 3,4,5,6 భాగములు మెహెర్ మౌనవాణి పబ్లికేషన్స్, 16-8-204/7, మలక్‌పేట, హైదరాబాద్-24 వద్ద లభిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క సంపుటి రూ. 250/-

## MEHER BOOK HOUSE

## ఆన్‌లైన్ బుక్ స్టోర్స్

**మెహెర్ మౌనవాణి పబ్లికేషన్స్, హైదరాబాద్ వారు** ఇంతవరకూ ప్రచురించిన అనేక అవతారుని గ్రంధాలను ఆన్‌లైన్ బుక్ స్టోర్‌ని ట్రస్టు చైర్మన్ శ్రీధర్ కేల్కర్ సెప్టెంబరు 8న మెహెరాబాద్‌లో ప్రారంభించారని శ్రీ బాలాజీ తెలిపారు. కాగా పాఠకులు తమకు కావల్సిన పుస్తకాలను ఆన్‌లైన్‌లో **meherbookhouse@gmail.comలో** ఆర్డర్ చేసుకోవచ్చని ఆయన అన్నారు. మరిన్ని వివరాలకు ph: +919849999010 / +917702257771, www.meherbookhouse.com సంప్రదించగలరు.

# జి.సిగడాం సెంటర్

అవతార్ మెహెర్‌బాబా జి.సిగడాం కేంద్ర 7వ వార్షికోత్సవం 14.09.2014, స్థానిక శ్రీ రంగనాధస్వామి కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించినట్లు అధ్యక్షులు శ్రీ డి.ఆర్.కె. గోపాలరావు, కార్యదర్శి శ్రీ శిరుగుడి గోవిందరావు తెలిపారు.

# చోడవరం సెంటర్

అవతార్ మెహెర్‌బాబా చోడవరం కేంద్ర 24వ వార్షికోత్సవం సందర్భంగా 07.09.2014, ఆదివారం ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రేమిక సహవాస్ నిర్వహించినట్లు అధ్యక్షులు శ్రీ తమటపు అప్పారావు, కార్యదర్శి శ్రీ తీగెల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# బాబాలో ఐక్యం



తాడేపల్లిగూడెం బాబా ప్రేమికులు శ్రీ కోట కుటుంబరావు, మేనేజర్, (రిటైర్డ్) ఎఫ్.సి.ఐ., బాబాలో ఐక్యమయి మూడు సంవత్సరాలు నిండిన సందర్భంగా 17.09.2011న తాము ప్రత్యేకంగా అవతారుడిని ఆ రోజున ఆరాధించామని ఆయన భార్య శ్రీమతి కోట ధనలక్ష్మీ కుమారి, సోదరి శ్రీమతి కోట సీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున బాబా నామస్మరణలో గడిపిన వైనాన్ని వివరిస్తూ వారు మెహెర్‌బాబా సంచికకు ఒక లేఖ రాశారు. అలాగే, కోఠి బాబా సెంటర్‌లో సెప్టెంబరు 13, శనివారం సత్సంగ్‌లో ప్రేమికులకు ఆపిల్ పండ్లు ప్రసాదంగా పంచిపెట్టామన్నారు

# మెహెర్‌బాబా

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం.**

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,

అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్, ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ ఇల్లిల్లాహ**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

**ప్రియ దైవమా!**

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యతం

**2014 ఆగష్టు - సెప్టెంబర్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 01. | సెప్టెంబర్ | డా॥ మన్నే రవీంధ్ర, ప్రకాశం జిల్లా | రూ. 1000.00 |
| | | **మొత్తం** | **రూ. 1000.00** |

## పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు). ఆన్‌లైన్‌లో పంపగోరువారు. శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్. **SB A/C NO: 173201000027973.**
**IFSC CODE: IOBA 0001732.**

### మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్, యాప్రాల్,**
**ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్-500087. ఫోన్:99595-53218,**
**email: malladisukku@gmail.com,**

Please visit : www.srimeherbaba.com

# ఆంధ్రా గెస్టు హౌసు

2015 జనవరి అవతారుని అమరతిధికి విచ్చేసే బాబా ప్రేమికులు, ముఖ్యంగా ఆంధ్రాగెస్టు హౌసుకు జీవిత సభ్యత్వం చెల్లించిన వారు, వయస్సురీత్యా పెద్దవారు, తమ వివరాలను త్వరలో నమోదు చేయించుకోవల్సిందిగా కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ కోరుతున్నారు. జలనిధికి దాతలు విరాళాలు పంపాలని ఆయన కోరుతున్నారు.

మరిన్ని వివరాలకు మేనేజర్, 0241-2548544 సంప్రదించగలరు.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month